భద్రాచలం, నవంబర్ 25 (ప్రభాత కిరణమ్ న్యూస్): రాష్ట్ర రెవెన్యూ, గృహ, సమాచార & ప్రజాసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి భద్రాచలం పర్యటనకు విచ్చేసిన నేపథ్యంలో ఆదివాసీ సంఘాల ఐక్య కార్యాచరణ వేదిక, భద్రాచలం నాయకులు స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు ద్వారా మర్యాదపూర్వకంగా మంత్రిని కలిసి వినతిపత్రం అందజేశారు. భద్రాచలం రెవెన్యూ గ్రామ సరిహద్దు లో సర్వే .నం.15/r లోగల ఒక ఎకరం 55 సెంట్లు గల భూమిని స్వాతంత్ర్య సమరయోధులు, ఆదివాసీ యోధుడ్లు భగవాన్ బిర్సాముండా, కోయ బెబ్బులి సోయం గంగులు విగ్రహ ప్రతిష్టాపన కు కేటాయించలని,తెల్లం శరత్ కుటుంబానికి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం 5 అక్రమ భూమి, ఇందిరమ్మ ఇల్లు మంజూరి చేయాలని మంత్రికి విజ్ఞప్తి చేశారు... ఈ సందర్భంగా భద్రాచలం నియోజకవర్గంలోని ఆదివాసీల సమస్యలు, ఆదివాసీల హక్కులు, పోడు భూములకు పట్టాలు, 1/70 చట్టం అమలు, ఆదివాసీ ప్రాంతాల అభివృద్ధి, మౌలిక సదుపాయాల కల్పన తదితర అంశాలను మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. ఆదివాసీల సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ చూపాలని, భద్రాచలం ప్రాంత అభివృద్ధికి తగిన చర్యలు తీసుకోవాలని నాయకులు కోరారు. ఈ కార్యక్రమంలో తెల్లం రామనయ్య, కుంజా ధర్మారావు, గుండు శరత్, కుంజా శ్రీనివాసరావు, విశాల కృష్ణయ్య, పాయం సత్యనారాయణ, కోర్సా చినబాబుదొర, ఆదివాసీ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇంటికి రెండు అంతస్తులా..? వినాయకపురంలో రచ్చ!

పేదల ఇళ్ల పథకంలో ఇదేం నిర్మాణం.. అధికారులకే తెలియదా?

నిబంధనలు ఏమయ్యాయి..? డబుల్ స్టోరీ నిర్మాణంపై విచారణ ఏదీ?



అశ్వారావుపేట నవంబర్ 25 (ప్రభాత కిరణమ్ న్యూస్): పేదలకు సొంతింటి కలను సాకారం చేసేందుకు ప్రభుత్వం అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇళ్ల పథకం ఇప్పుడు వినాయకపురంలో చర్చనీయాంశంగా మారింది. అశ్వారావుపేట మండలం వినాయకపురంలో ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద మంజూరైనట్లు చెబుతున్న ఓ ఇంటికి రెండు అంతస్తుల నిర్మాణం చేపడుతుండటం పలు అనుమానాలకు తావిస్తోంది. అసలు ఇందిరమ్మ ఇళ్ల పథకం మార్గదర్శకాలు రెండు అంతస్తుల నిర్మాణానికి అనుమతిస్తున్నాయా? అదనపు అంతస్తును లబ్ధిదారుడు సొంత ఖర్చులతో నిర్మిస్తున్నారా? లేక అధికారుల అనుమతులు ఉన్నాయా? అన్న ప్రశ్నలు స్థానికంగా వినిపిస్తున్నాయి. ఒకవైపు అర్హులైన పేదలు ఇళ్ల కోసం ఎదురుచూస్తుంటే, మరోవైపు పథకం కింద చేపడుతున్న ఈ నిర్మాణంపై స్పష్టత లేకపోవడం చర్చకు దారితీస్తోంది. సంబంధిత అధికారులు తక్షణమే క్షేత్రస్థాయిలో తనిఖీ చేసి, నిర్మాణానికి సంబంధించిన అనుమతులు, పథకం నిబంధనలపై విచారణ జరిపి వాస్తవాలను వెల్లడించాలని స్థానికులు కోరుతున్నారు. అర్హులకు అన్యాయం జరగకుండా అధికారులు పారదర్శకంగా వ్యవహరించాలని డిమాండ్ చేస్తున్నారు.

రామాలయ అభివృద్ధి పనులు గడువులోపే పూర్తి చేయాలి

గృహ,రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి..





భద్రాచలం, నవంబర్ 25 (ప్రభాత కిరణమ్ న్యూస్): భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి ఆలయ అభివృద్ధి పనులను గోదావరి పుష్కరాల నాటికి పూర్తి చేయాలని రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అధికారులను ఆదేశించారు. ఆలయ అభివృద్ధికి సుమారు రూ.300 కోట్లు కేటాయించామని, భక్తుల ఆకాంక్షలకు అనుగుణంగా శాశ్వత ప్రాతిపదికన రాతి కట్టడాలు నిర్మించాలని స్పష్టం చేశారు. బుధవారం భద్రాచలంలో ఆలయ అభివృద్ధి పనులను పరిశీలించిన మంత్రి.. పనుల్లో జాప్యాన్ని సహించేది లేదని హెచ్చరించారు. కార్మికులు, సాంకేతిక సిబ్బంది సంఖ్యను పెంచి కనీసం 300 మందితో పనులు కొనసాగించాలని ఆదేశించారు. పెండింగ్ డిజైన్లు, డ్రాయింగ్‌లను వెంటనే పూర్తి చేసి నిర్మాణ సామగ్రిని ముందుగానే సమకూర్చుకోవాలని సూచించారు. గోదావరి పుష్కరాల అభివృద్ధి కోసం బాసర నుంచి భద్రాచలం వరకు వివిధ శాఖల ద్వారా రూ.1,100 కోట్లకు పైగా నిధులు కేటాయించినట్లు మంత్రి వెల్లడించారు. డిసెంబర్ 19న జరిగే ముక్కోటి ఏకాదశికి భక్తులకు ఇబ్బందులు లేకుండా శాశ్వత సదుపాయాలు కల్పించాలని అధికారులను ఆదేశించారు. అనంతరం, నూతన మార్కెట్‌లో రూ.కోటి వ్యయంతో నిర్మించనున్న గిరిజన బహుళ ప్రయోజన మార్కెట్ కేంద్రానికి, రంగనాయకుల గుట్ట వద్ద రూ.5.45 కోట్లతో చేపట్టనున్న తాగునీరు, ఇతర మౌలిక వసతుల అభివృద్ధి పనులకు మంత్రి శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ అంకిత్, ఎమ్మెల్యేలు తెల్లం వెంకట్రావు, పాయం వెంకటేశ్వర్లు, అశ్వారావుపేట ఎమ్మెల్యే ఆదినారాయణ, ఐటీడీఏ పీవో రాహుల్, సబ్ కలెక్టర్ మృణాల్ శ్రేష్ఠ, దేవస్థానం ఈవో దామోదర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

మంత్రి పొంగులేటి చేతుల మీదుగా బీసీఎం ప్రెస్‌క్లబ్ బ్రోచర్ ఆవిష్కరణ

మీడియా రంగ అభివృద్ధికి జర్నలిస్టుల సంఘాల కృషి కీలకం..



భద్రాచలం, నవంబర్ 25 (ప్రభాత కిరణమ్ న్యూస్): బీసీఎం ప్రెస్ క్లబ్ అండ్ మీడియా డెవలప్‌మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో రూపొందించిన నూతన బ్రోచర్‌ను రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ఆవిష్కరించారు. భద్రాచలంలోని శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానం సమీపంలో బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో మంత్రి బ్రోచర్‌ను ఆవిష్కరించారు. క్లబ్ సభ్యుల వివరాలు, సంస్థ కార్యకలాపాలతో రూపొందించిన ఈ బ్రోచర్ ఆవిష్కరణ కార్యక్రమంలో భద్రాచలం ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు, పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు, అశ్వారావుపేట ఎమ్మెల్యే జారే ఆదినారాయణ, మాజీ ఎమ్మెల్సీ బాలసాని లక్ష్మీనారాయణ, భద్రాచలం సర్పంచ్ పూనెం కృష్ణదొర, బీసీఎం ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు అన్నెం సుధీర్, కార్యదర్శి బి. సాయి కౌశిక్, సభ్యులు ఎం.డి. యాకూబ్ మియా, ఓ. సురేష్, ఆర్. వెంకటేశ్వర్లు, పాల్గొన్నారు.

దురదపాడులో పోలీసుల మెరుపు కార్డన్ సెర్చ్..

101 ఇళ్లలో విస్తృత తనిఖీలు

గంజాయి, జూదాలపై పోలీసుల హెచ్చరిక.. డ్రగ్స్ రహిత సమాజానికి గ్రామస్తుల ప్రతిజ్ఞ

దమ్మపేట మండలంలో తెల్లవారుజామున తనిఖీలు..

75 వాహనాల పత్రాల పరిశీలన



అశ్వారావుపేట /దమ్మపేట నవంబర్ 25 (ప్రభాత కిరణమ్ న్యూస్): దమ్మపేట మండల పోలీస్ స్టేషన్ పరిధిలోని గండుగులపల్లి గ్రామ పంచాయతీ దురదపాడు గ్రామంలో బుధవారం తెల్లవారుజామున పోలీసులు మెరుపు కార్డన్ అండ్ సెర్చ్ ఆపరేషన్ నిర్వహించారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఎస్పీ బి. రోహిత్ రాజు ఐపీఎస్ ఆదేశాలు, పాల్వంచ డీఎస్పీ సతీష్ కుమార్ సూచనల మేరకు అశ్వారావుపేట సీఐ నాగరాజు రెడ్డి, దమ్మపేట ఎస్‌హెచ్‌ఓ రాజేష్ తమ బృందాలతో కలిసి ఈ తనిఖీలు చేపట్టారు. ఈ ఆపరేషన్‌లో భాగంగా గ్రామంలోని మొత్తం 101 ఇళ్లను పోలీసులు క్షుణ్ణంగా తనిఖీ చేశారు. అలాగే 67 ద్విచక్ర వాహనాలు, 5 ప్రయాణికుల ఆటోలు, 2 ట్రాక్టర్లు, ఒక బొలెరో కలిపి మొత్తం 75 వాహనాల పత్రాలను పరిశీలించి ధృవీకరించారు. గ్రామంలో శాంతిభద్రతల పరిరక్షణ, చట్టవ్యతిరేక కార్యకలాపాల నియంత్రణ లక్ష్యంగా ఈ తనిఖీలు నిర్వహించారు. తనిఖీల అనంతరం గ్రామస్తులతో సమావేశమై గంజాయి వినియోగం, అక్రమ రవాణా వల్ల కలిగే అనర్థాలను వివరించారు. మూఢనమ్మకాలు, కోడిపందేలు, పేకాట వంటి వాటి వల్ల కలిగే ఆర్థిక, సామాజిక నష్టాలపై అవగాహన కల్పించారు. అలాగే రహదారి భద్రత, సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఎవరూ చట్టాన్ని చేతుల్లోకి తీసుకోవద్దని, చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. గ్రామంలో ఎక్కడైనా గంజాయి వినియోగం లేదా అక్రమ రవాణాకు సంబంధించిన సమాచారం తెలిస్తే వెంటనే పోలీసులకు తెలియజేయాలని కోరారు. అనంతరం మాదకద్రవ్యాల రహిత సమాజ నిర్మాణానికి కృషి చేస్తామని, మాదకద్రవ్యాలకు సంబంధించిన సమాచారాన్ని ఎప్పటికప్పుడు పోలీసులకు అందిస్తామని గ్రామస్తులతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్ఐ బాలస్వామి, అశ్వారావుపేట ఎస్ఐ దేవ్‌సింగ్‌తో పాటు అశ్వారావుపేట సర్కిల్ పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ఆదివాసీలకు న్యాయం జరిగేలా జ్యుడీషియల్ కమిషన్ ఏర్పాటు చేయాలి

లంబాడీల ఎస్టీ హోదాపై పునఃపరిశీలన జరపాలి...

డిసెంబరు 9న మహబూబాబాద్‌లో సాంస్కృతిక ధర్మయుద్ధం..

భద్రాచలం నవంబర్ 25 (ప్రభాత కిరణమ్ న్యూస్): ఐదు దశాబ్దాలుగా ఆదివాసీ తెగలకు జరుగుతున్న అన్యాయంపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు జ్యుడీషియల్ కమిషన్ ఏర్పాటు చేసి సమగ్ర విచారణ జరిపించాలని తొమ్మిది ఆదివాసీ తెగల జేఏసీ చైర్మన్ చుంచు రామకృష్ణ డిమాండ్ చేశారు. బుధవారం భద్రాచలంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాజ్యాంగం కల్పించిన విద్య, ఉద్యోగ, రాజకీయ అవకాశాలు ఆదివాసీలకు పూర్తిస్థాయిలో అందడం లేదని, అటవీ సంపద క్షీణతతో వారి జీవనోపాధి దెబ్బతింటోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఆదివాసీల సంస్కృతి పరిరక్షణకు కేటాయిస్తున్న నిధులు పక్కదారి పడుతున్నాయని ఆరోపించారు. 1976లో లంబాడీలను ఎస్టీ జాబితాలో చేర్చిన అంశాన్ని పునఃపరిశీలించి ఆదివాసీ తెగలకు న్యాయం చేయాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను కోరారు. ఈ సమస్యలపై ప్రజల్లో చైతన్యం కల్పించేందుకు డిసెంబరు 9న మహబూబాబాద్ ఎన్టీఆర్ స్టేడియంలో సాంస్కృతిక ధర్మయుద్ధం నిర్వహించనున్నట్లు వెల్లడించారు. తెలంగాణతో పాటు ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్, ఒడిశా రాష్ట్రాల ఆదివాసీ సాంస్కృతిక బృందాలు పాల్గొంటాయని తెలిపారు. సభను శాంతియుతంగా, ప్రజాస్వామ్యబద్ధంగా నిర్వహిస్తామన్నారు. ఆదివాసీల హక్కులు, సంస్కృతి, సంప్రదాయాల పరిరక్షణ కోసం నిర్వహించే సభకు పెద్దఎత్తున తరలిరావాలని పిలుపునిచ్చారు. సమావేశంలో గోండ్వానా సంక్షేమ పరిషత్ రాష్ట్ర అధ్యక్షుడు పాయం సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



జర్నలిస్టుల సమస్యలపై మంత్రి పొంగులేటికి వినతి

అర్హులకు ఇళ్ల స్థలాలు.. డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు కేటాయించాలి..

కార్పొరేట్ ఆసుపత్రుల్లో నగదు రహిత వైద్యం అందించాలి..

సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని మంత్రి హామీ..



భద్రాచలం, నవంబర్ 25 (ప్రభాత కిరణమ్ న్యూస్): జర్నలిస్టుల సంక్షేమానికి ప్రభుత్వం ప్రాధాన్యమివ్వాలని, అర్హులైన ప్రతి జర్నలిస్టుకు ఇంటి స్థలం లేదా డబుల్ బెడ్‌రూమ్ ఇల్లు కేటాయించాలని టీయూడబ్ల్యూజే (ఐజేయూ) భద్రాచలం డివిజన్ అధ్యక్షుడు భూక్యా రంజిత్ నాయక్ కోరారు. జర్నలిస్టుల సమస్యల పరిష్కారం కోసం ఆయన నేతృత్వంలోని ప్రతినిధి బృందం రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డిని కలిసి వినతిపత్రం అందజేసింది. భద్రాచలంలో అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన చేసేందుకు బుధవారం వచ్చిన మంత్రిని కలిసి జర్నలిస్టులు తమ సమస్యలను వివరించారు. ప్రభుత్వం మంజూరు చేసిన హెల్త్ కార్డులను పలు కార్పొరేట్ ఆసుపత్రులు అంగీకరించకపోవడంతో జర్నలిస్టులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. హెల్త్ కార్డుల ద్వారా ముందస్తుగా నగదు చెల్లించకుండానే కార్పొరేట్ ఆసుపత్రుల్లో నగదు రహిత వైద్య సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ మేరకు ఆసుపత్రులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేసి జర్నలిస్టుల ఆరోగ్య భద్రతకు భరోసా కల్పించాలని విజ్ఞప్తి చేశారు. జర్నలిస్టుల విన్నపాలపై మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి సానుకూలంగా స్పందించారు. వారి సమస్యల పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో టీయూడబ్ల్యూజే (ఐజేయూ) భద్రాచలం డివిజన్ ఉపాధ్యక్షులు సత్యం కాట. ప్రింటు, ఎలక్ట్రానిక్ మీడియా డివిజన్ నాయకులు, సభ్యులు వై. దుర్గాప్రసాద్‌రెడ్డి, బండారు మహేశ్, శ్రీశ్రీ, జగన్ తదితరులు పాల్గొన్నారు.

పేదల సంక్షేమమే ప్రజా ప్రభుత్వ ప్రధాన లక్ష్యం

-గత ప్రభుత్వ అప్పుల భారం ఉన్నప్పటికీ సంక్షేమ పథకాల అమలులో రాజీ లేదు

-రాష్ట్ర వ్యాప్తంగా 4.7 లక్షల కొత్త చేయూత పింఛన్లు మంజూరు

-2,464 మంది కొత్త పింఛను లబ్ధిదారుల ఎంపిక

-ప్రతి కుటుంబానికి రూ.5 లక్షల బీమా భద్రత కల్పించేందుకు ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం అమలు

-యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్ వచ్చే ఏడాది జూన్ నాటికి అన్ని నిర్మాణ పనులు పూర్తి చేయాలి

-నూతన చేయూత పింఛన్ల, కళ్యాణలక్ష్మి, సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

-రాష్ట్ర ఐటీ, పరిశ్రమలు, శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు





రామగిరి నవంబర్ 25 (ప్రభాత కిరణమ్ న్యూస్): గత ప్రభుత్వ హయాంలో తీసుకున్న అప్పుల కారణంగా రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై భారం ఉన్నప్పటికీ పేద ప్రజల సంక్షేమం విషయంలో ప్రజా ప్రభుత్వం ఎక్కడా రాజీ పడటం లేదని రాష్ట్ర ఐటీ, ఎలక్ట్రానిక్స్, పరిశ్రమలు, శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు అన్నారు. బుధవారం మంథనిలోని ఆర్ఆర్ గార్డెన్స్‌లో జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్షతో కలిసి నూతన చేయూత పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కొత్తగా మంజూరైన పింఛన్లను లబ్ధిదారులకు అందజేయడంతో పాటు 200 కళ్యాణలక్ష్మి, 117 ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్ఎఫ్) చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణలో అధికారంలోకి వచ్చే నాటికి గత ప్రభుత్వ హయాంలో తీసుకున్న అప్పుల కారణంగా సుమారు రూ.8 లక్షల కోట్ల ఆర్థిక భారం ఉందని తెలిపారు. ఒకవైపు రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని మెరుగుపరుస్తూనే, మరోవైపు ఎన్నికల సమయంలో పేద ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని నెరవేరుస్తున్నామని స్పష్టం చేశారు. సూపర్ ఎల్‌నినో పరిస్థితులు నెలకొన్నప్పటికీ రాష్ట్రవ్యాప్తంగా వితంతువులు, ఒంటరి మహిళలు, దివ్యాంగులు తదితర అర్హులైన వర్గాలకు సుమారు 4.7 లక్షల కొత్త చేయూత పింఛన్లు మంజూరు చేశామని తెలిపారు. పేదలు, నిరుపేద కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పించడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రజా ప్రభుత్వం అనేక సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తోందన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా రాష్ట్రంలో ప్రతి వ్యక్తికి నెలకు 6 కిలోల సన్నబియ్యాన్ని రేషన్ దుకాణాల ద్వారా ఉచితంగా అందిస్తున్నామని తెలిపారు. మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించామని, ఈ పథకం అమలుకు ప్రభుత్వం ఇప్పటివరకు ఆర్టీసీకి సుమారు రూ.13 వేల కోట్లు చెల్లించిందని వివరించారు. ఆరోగ్యశ్రీ వైద్య చికిత్స పరిమితిని రూ.10 లక్షలకు పెంచామని, 25 లక్షల మంది రైతులకు సుమారు రూ.21 వేల కోట్ల మేరకు రూ.2 లక్షల రుణమాఫీ అమలు చేశామని తెలిపారు. రైతు భరోసా పథకం కింద ఎకరాకు అందించే పెట్టుబడి సాయాన్ని రూ.10 వేల నుంచి రూ.12 వేలకు పెంచడంతో పాటు, సన్నధాన్యం సాగు చేసే రైతులకు క్వింటాలుకు రూ.500 బోనస్ అందిస్తున్నామని చెప్పారు. గత పదేళ్లలో కొత్త రేషన్ కార్డులు మంజూరు చేయలేదని, ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అర్హులైన కుటుంబాలకు కొత్త రేషన్ కార్డులు మంజూరు చేసిందని, ఇప్పటివరకు 16 లక్షలకు పైగా కొత్త రేషన్ కార్డులు అందించినట్లు తెలిపారు. అర్హులైన ప్రతి కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు అందించడమే తమ ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. రాష్ట్రంలోని ప్రతి కుటుంబానికి రూ.5 లక్షల జీవిత బీమా భద్రత కల్పించేందుకు ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకాన్ని అమలు చేస్తున్నామని తెలిపారు. ఈ పథకానికి సంబంధించి అధికారులు గ్రామాలు, పట్టణాల్లో ప్రత్యేక శిబిరాల ద్వారా కుటుంబాల వివరాలను సేకరిస్తున్నారని చెప్పారు. ప్రతి కుటుంబం తమ నామినీ వివరాలను అధికారులకు తప్పనిసరిగా అందించాలని సూచించారు. అర్హులైన ప్రతి కుటుంబానికి రూ.5 లక్షల బీమా ప్రయోజనం అందేలా ప్రజలు అధికారులకు సహకరించాలని కోరారు. ప్రజా ప్రభుత్వం ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తూ పేదల జీవితాల్లో భరోసా కల్పిస్తోందని, సంక్షేమం, అభివృద్ధిని సమాంతరంగా ముందుకు తీసుకెళ్తున్నామని స్పష్టం చేశారు. జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష మాట్లాడుతూ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు ఆదేశాల మేరకు కమాన్‌పూర్, మంథని, ముత్తారం, రామగిరి మండలాల్లో కొత్తగా 2,464 మంది చేయూత పింఛను లబ్ధిదారులను ఎంపిక చేసినట్లు తెలిపారు. ప్రభుత్వం నిర్దేశించిన మార్గదర్శకాల ప్రకారం అర్హులైన వారిని గుర్తించి కొత్త పింఛన్లు మంజూరు చేసినట్లు వివరించారు. కొత్తగా పింఛన్లు మంజూరైన లబ్ధిదారులకు మరో శుభవార్తగా, రేపటి నుంచే వారి బ్యాంకు ఖాతాల్లో పింఛను సొమ్ము జమ కానుందని తెలిపారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు సంక్షేమ పథకాల ప్రయోజనాలు అర్హులైన చివరి వ్యక్తి వరకు చేరేలా జిల్లా యంత్రాంగం పనిచేస్తోందని స్పష్టం చేశారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు అందించేందుకు అధికారులు క్షేత్రస్థాయిలో సమగ్రంగా పరిశీలించి చర్యలు తీసుకోవాలని సూచించారు. ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకానికి సంబంధించి కుటుంబ సభ్యులు, నామినీ వివరాలను సక్రమంగా అందించి అధికారులకు సహకరించాలని ప్రజలను కోరారు. అనంతరం మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్షతో కలిసి అడవి సోమన్ పల్లిలో నిర్మాణంలో ఉన్న యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్ పనులను పరిశీలించారు. ఇప్పటివరకు 40 శాతం పనులు పూర్తయ్యాయని అధికారులు వివరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ నిర్మాణ పనులను వేగవంతం చేసి నాణ్యతలో ఎలాంటి రాజీ లేకుండా పూర్తి చేయాలని ఆదేశించారు. వచ్చే విద్యా సంవత్సరం ప్రారంభం నాటికి, అంటే జూన్ 2027 నుంచి తరగతులు ప్రారంభించేలా అన్ని పనులు పూర్తి చేయాలని స్పష్టం చేశారు. పనుల పురోగతిని జిల్లా కలెక్టర్ నిరంతరం పర్యవేక్షించాలని, నిర్దేశిత గడువులోగా పనులు పూర్తి చేయడంలో ఎలాంటి జాప్యాన్ని, సాకులను సహించబోమని మంత్రి అధికారులకు తేల్చిచెప్పారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు, నూతన పింఛను లబ్ధిదారులు, కళ్యాణలక్ష్మి, సీఎంఆర్ఎఫ్ లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

బిందుమాధవి--సందీప్ రెడ్డి వివాహ వేడుకకు హాజరైన మాజీ ఎమ్మెల్యే రెడ్యానాయక్.



డోర్నకల్ ప్రతినిధి నవంబర్ 25 (ప్రభాత కిరణమ్ న్యూస్): దంతాలపల్లి మండలం రామాంజపురం గ్రామానికి చెందిన తూడి సుధాకర్--శైలజ దంపతుల కుమార్తె బిందుమాధవి వివాహం సందీప్ రెడ్డితో బుధవారం మద్దిరాల ఎక్స్‌రోడ్డులోని మధు గార్డెన్స్‌లో ఘనంగా జరిగింది. ఈ వివాహ వేడుకకు డోర్నకల్ మాజీ ఎమ్మెల్యే డీఎస్ రెడ్యానాయక్ హాజరై నూతన వధూవరులు బిందుమాధవి, సందీప్ రెడ్డిలను ఆశీర్వదించారు.

ఈ సందర్భంగా వధూవరులకు శుభాకాంక్షలు తెలియజేసి, వారి వైవాహిక జీవితం సుఖసంతోషాలతో సాగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఓలాద్రి ఉమా మల్లారెడ్డి, రేపోణి వెంకట్ రెడ్డి, గణేష్, రామ్మూర్తి తదితరులు పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించారు.

యర్రగొండపాలెం లో మళ్ళీ వైసీపీ కి షాక్



యర్రగొండపాలెం నవంబర్ 25 (ప్రభాత కిరణమ్ న్యూస్): యర్రగొండపాలెం మండలం గుర్రపుశాల గ్రామానికి చెందిన మాజీ వార్డు మెంబర్ తో సహా 17 వైసీపీ కుటుంబాలు వైసీపీ పార్టీ కి రాజీనామా చేసి యర్రగొండపాలెం నియోజకవర్గ టీడీపీ ఇంచార్జ్ గూడూరి ఎరిక్షన్ బాబు సమక్షంలో టీడీపీలో చేరారు. వారికి ఎరిక్షన్ బాబు , మార్కెట్ యార్డ్ చైర్మన్ చేకూరి సుబ్బారావు , మండల టీడీపీ అధ్యక్షులు చిట్యాల వెంగళరెడ్డి పార్టీ కండువాలు వేసి పార్టీలో ఆహ్వానించారు. కూటమి ప్రభుత్వం పాలన నచ్చి పార్టీలో చేరామని వారు తెలిపారు.

మొబైల్ యాప్ ద్వారానే ఎరువుల ముందస్తు బుకింగ్: ఎంపీఓ ఎం.డి. ఫారుఖ్.

గూడవల్లి, కనగాల గ్రామాల్లో 'పొలం పిలుస్తోంది'.. ధాన్యం నాణ్యత, మద్దతు ధరపై రైతులకు సూచనలు.





చెరుకుపల్లి, నవంబర్ 25 (ప్రభాత కిరణమ్ న్యూస్): మండల పరిధిలోని గూడవల్లి, కనగాల గ్రామాల్లో బుధవారం మండల వ్యవసాయ అధికారి ఎం.డి. ఫారుఖ్ ఆధ్వర్యంలో 'పొలం పిలుస్తోంది' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన ఎరువుల పంపిణీ విధానం ఫంబుస్ (ఫర్టిలైజర్ బుకింగ్ సిస్టం) పై రైతులకు సమగ్ర అవగాహన కల్పించారు. రైతులు స్వయంగా మొబైల్ యాప్ ద్వారా తమ భూ వివరాలను నమోదు చేయడం, పంటను ఎంపిక చేసుకోవడం, అవసరమైన ఎరువులు మరియు సంబంధిత ఎరువుల దుకాణాన్ని ఎంచుకొని ముందస్తుగా బుకింగ్ చేసుకునే విధానాన్ని అధికారి రైతులకు ప్రత్యక్షంగా (లైవ్ డెమో) వివరించారు. రైతులకు ఈ నూతన విధానం మరింత సులభంగా అందుబాటులో ఉండేందుకు రైతు సేవా కేంద్రాలు (రస్క్), పాక్స్ లు మరియు ప్రైవేట్ ఎరువుల దుకాణాల్లో ప్రత్యేక హెల్ప్ డెస్క్‌లను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అనంతరం, ప్రస్తుతం వరి పంట కోత దశలో ఉన్నందున కోత సమయంలో మరియు అనంతరం రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ధాన్యం నాణ్యత ప్రమాణాలను కాపాడుకోవాల్సిన పద్ధతులను వివరించారు. అలాగే ప్రభుత్వం ప్రకటించిన కనీస మద్దతు ధర (మ్సప్) వివరాలను రైతులకు తెలియజేస్తూ, దళారులను ఆశ్రయించకుండా ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పాక్స్ అధ్యక్షులు ఎ. నరేంద్ర కుమార్, వ్యవసాయ శాఖ సిబ్బంది, అభ్యుదయ రైతులు మరియు గ్రామస్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ధర్మవరం అభివృద్ధే మా లక్ష్యం-వైసీపీ సర్పంచ్ అభ్యర్థి ముదునూరి సీతారామరాజు



ప్రత్తిపాడు, నవంబర్ 25 (ప్రభాత కిరణమ్ న్యూస్): ధర్మవరం గ్రామపంచాయతీ కీర్తి ప్రతిష్టలను మరింత పెంచుతూ, అభివృద్ధి పథంలో మహోన్నత స్థానంలో నిలబెట్టేందుకు కృషి చేస్తామని వైసీపీ సర్పంచ్ అభ్యర్థి ముదునూరి సీతారామరాజు, వైసీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ముదునూరి మురళీకృష్ణంరాజు స్పష్టం చేశారు. బుధవారం ధర్మవరం గ్రామపంచాయతీ పరిధిలోని పలు వార్డుల్లో అనుచరులు, పార్టీ శ్రేణులతో కలిసి వారు విస్తృతంగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. రైతులు, నేతన్నలు, కార్మికులు, వివిధ వృత్తుల వారిని ఆప్యాయంగా పలకరిస్తూ ఓట్లు అభ్యర్థించారు. ఈ సందర్భంగా ముదునూరి సోదరులు మాట్లాడుతూ ధర్మవరం గ్రామానికి జిల్లాలో ప్రత్యేక గుర్తింపు, విశిష్ట ఉందని, ఆ ఖ్యాతిని మరింత ఇనుమడింపజేసేలా గ్రామాభివృద్ధికి నిరంతరం కృషి చేస్తామని పేర్కొన్నారు. ప్రజల ఆశీస్సులతో గ్రామానికి మరింత పేరు ప్రతిష్టలు తీసుకొస్తామని తెలిపారు. ఈ ప్రచారంలో స్థానిక పెద్దలు జువ్వల చినబాబు, బొల్లు సీతారామరాజు, ఎంపీటీసీ గొనగాల గోపి, కిల్లాడి బాబ్జి, యాళ్ల ఏసుబాబు, ఊబ కృపావరం, నానిపల్లి చంటి, కోన బాబ్జి, గొనగాల రామకృష్ణ, కోలా తాతబాబు, బొల్లు నాగేశ్వరరావు, జువ్వల దొరబాబు తదితరులు పాల్గొన్నారు.

ధర్మవరంలో ప్రచారంలో దూసుకుపోతున్న పుణ్యమంతుల (గోవిందరాజులు) రాజా

ఎమ్మెల్యే సత్యప్రభ ఆశీస్సులతో ధర్మవరం సర్పంచ్ బరిలో రాజా

పలు వార్డుల్లో మహిళల హారతులతో ఘనస్వాగతం



ప్రత్తిపాడు, నవంబర్ 25 (ప్రభాత కిరణమ్ న్యూస్): కాకినాడ జిల్లా ప్రత్తిపాడు మండలం ధర్మవరం గ్రామంలో ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ ఆశీస్సులతో కూటమి బలపరిచిన సర్పంచ్ అభ్యర్థిగా పుణ్యమంతుల రాజా ఎన్నికల బరిలో నిలిచారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా పలు వార్డుల్లో ఇంటింటికీ వెళ్లి ఓటర్లను కలుస్తుండగా మహిళలు హారతులు పట్టి ఘనస్వాగతం పలుకుతున్నారు. గ్రామంలో అడుగడుగునా ప్రజలను కలుస్తూ మద్దతు కోరుతున్నారు. గ్రామ అభివృద్ధే లక్ష్యంగా ముందుకు సాగుతున్న పుణ్యమంతుల రాజా ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ సహకారంతో గ్రామంలో పారిశుధ్యం, డ్రైనేజీ, వీధిలైట్లు, రహదారులు, తాగునీటి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇస్తూ ఓటర్ల మద్దతు కోరుతున్నారు. ఈ ప్రచార కార్యక్రమంలో వైస్ ఎంపీపీ ముప్పనబోయిన వెంకటలక్ష్మి ఏసుబాబు, ఎంపీటీసీ దాడి వేణుగోపాల్, మాజీ సర్పంచ్ పుణ్యమంతుల కామరాజు, పుణ్యమంతుల ఏడుకొండలు, పుణ్యమంతుల శ్రీను, పుణ్యమంతుల రవి, బొల్లు కొండబాబు, దాట్ల అప్పన్నబాబు, దాట్ల కృష్ణబాబు, బొండాడ నారాయుడు, బొల్లు మనోజ్, నామాడి వాల్టన్, శ్రీను, పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొని మద్దతు తెలిపారు.

దోర్నాలలో కోతుల పట్టిస్తానని ఎన్నికల ప్రచారంలో హామీ నెరవేర్చిన సర్పంచ్ అభ్యర్థి ఇరసాని దేవయ్య యాదవ్

మార్కాపురం జిల్లా పెద్ద దోర్నాల నవంబర్ 25 (ప్రభాత కిరణమ్ న్యూస్): దోర్నాల మేజర్ పంచాయతీలో కోతుల సమస్య పరిష్కారానికి టీడీపీ నాయకులు స్వచ్ఛందంగా ముందుకొచ్చారు. గ్రామంలో కోతుల బెడదతో ఇబ్బందులు పడుతున్న ప్రజలకు ఉపశమనం కల్పించేందుకు కోతులను పట్టించే కార్యక్రమాన్ని చేపట్టారు. ప్రధాన ప్రాంతాల్లో బోన్ లు ఏర్పాటు చేసి కోతులను పట్టిస్తున్నారు. సర్పంచ్ ఎన్నికల వేళ ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ఈ కార్యక్రమం చేపట్టడం స్థానికంగా చర్చనీయాంశంగా మారింది. ఎన్నికల సమయంలో హామీలకే పరిమితం కాకుండా.. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై దృష్టి సారించడం తమ బాధ్యతగా టీడీపీ నాయకులు భావిస్తున్నట్లు ఈ కార్యక్రమం ద్వారా స్పష్టమవుతోంది. ముఖ్యంగా కోతుల సమస్యను పరిష్కరిస్తామని కూటమి సర్పంచ్ అభ్యర్థి ఇరకసాని దేవయ్య యాదవ్ ప్రచారంలో హామీ ఇస్తున్న నేపథ్యంలో.. పార్టీ నాయకులు చేపట్టిన ఈ చర్య అభ్యర్థికి సానుకూలంగా మారే అవకాశం కనిపిస్తోంది ఈ మంచి కార్యక్రమానికి దోర్నాల ప్రజలు సర్పంచ్ అభ్యర్థికి కృతజ్ఞతలు తెలిపారు

శ్రీశైల దేవస్థానం రుద్ర వనములో కార్తీక వనభోజనాలు







శ్రీశైలం నవంబర్ 25 (ప్రభాత కిరణమ్ న్యూస్): కార్తీకమాసోత్సవాల నిర్వహణలో భాగంగా దేవస్థానం కార్తీక వన భోజనాల కార్యక్రమం నిర్వహించినట్లు ధర్మకర్తల మండలి అధ్యక్షులు పోతు గుంట రమేష్‌నాయుడు మరియు కార్యనిర్వహణాధికారి యం శ్రీనివాసరావు తెలిపారు. ఆలయ ఈశాన్యభాగంలోని రుద్రవనంలో కార్యక్రమం ఏర్పాటు చేయబడిందన్నారు. ఈ వనభోజన కార్యక్రమములో స్థానిక శాసనసభ్యులు బుడ్డా రాజశేఖరరెడ్డి, దేవస్థాన ధర్మకర్తల మండలి అధ్యక్షులు శ్రీపోతుగుంట రమేష్‌నాయుడు, దేవస్థానం కార్యనిర్వహణాధికారి యం . శ్రీనివాసరావు మరియు పలువురు ధర్మకర్తల మండలి సభ్యులు పాల్గొన్నారు. అలాగే శ్రీశైలదేవస్థానం అన్నీ విభాగాల అధికారులు, సిబ్బంది కుటుంబసమేతంగా పాల్గొన్నారు. అదేవిధంగా పలుస్థానిక ప్రభుత్వశాఖల అధికారులు, సిబ్బంది కూడా పాల్గొన్నారు. కార్యక్రమములో ముందుగా సంప్రదాయాన్ని అనుసరించి రుద్రవనములోని ఉసిరిచెట్టుకు సంప్రదాయబద్దంగా పూజాదికాలు జరిపించబడ్డాయి. ఈ కార్యక్రమములో తదనంతరం ధర్మకర్తల మండలి అధ్యక్షులు వారు మాట్లాడుతూ వైదికసంస్కృతీ సంప్రదాయాల పరిరక్షణలో భాగంగా మరియు ఆలయ సంప్రదాయాలపై అందరికి అవగాహన కల్పించాలనే భావనతో ఈ వనసమారాధన కార్యక్రమం ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. సంప్రదాయబద్దంగా వనభోజనాలు చేయడం వలన విశేషఫలితం లభిస్తుందని పురాణాలు పేర్కొంటున్నాయన్నారు. అనంతరం కార్యనిర్వహణాధికారి శ్రీ యం. శ్రీనివాసరావు మాట్లాడుతూ శ్రీశైలమహాక్షేత్రంలో వనభోజనాలు ఆచరించడం వల్ల మరింత ఫలితం లభిస్తుందన్నారు. శ్రీశైలాన్ని క్షేత్రంగానే కాకుండా గొప్పతీర్థంగా కూడా మన పురాణాలు పేర్కొన్నాయన్నారు. ఈ క్షేత్రం ఎన్నో తీర్థాలకు నిలయమన్నారు. శ్రీశైల మహాక్షేత్రానికి అనాది క్షేత్రం అనే ప్రసిద్ధి ఉందన్నారు. యుగయుగాలుగా ఈ క్షేత్రం ఎంతో ప్రసిద్ధి చెందిందన్నారు. భూ మండలానికి నాభిస్థానంగా ఈ క్షేత్రం పేర్కొనబడిందని, అందుకే మనం ఆచరించే వైదిక కార్యక్రమాలు, పూజాదికార్యక్రమాలలో చెప్పే సంకల్పంలో మన ఉనికిని శ్రీశైలక్షేత్రాన్ని కేంద్రంగా చేసుకుని చెప్పడం జరుగుతుందన్నారు. ఈ సందర్భంగా కార్తీకమాసం -- వనభోజనాల విశిష్టత అనే అంశంపై ప్రముఖ ఆధ్యాత్మిక వేత్త నోరి నారాయణమూర్తి, తెనాలి వారు ప్రవచనాన్ని వినిపించారు. అనంతరం లిక్షితాశ్రీ నృత్యకళాశాల, నందికొట్కూరు వారిచే సంప్రదాయనృత్య ప్రదర్శన కార్యక్రమం నిర్వహించబడింది.

రబీ పంటలకు బీమా తప్పనిసరిగా చేయించుకోవాలి

డిసెంబర్ 15లోగా పంటల బీమా నమోదు పూర్తి చేసుకోవాలి

మిల్లంపల్లిలో పొలం పిలుస్తుంది కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి నీరజ



యర్రగొండపాలెం నవంబర్ 25 (ప్రభాత కిరణమ్ న్యూస్): రబీ సీజన్‌లో పంటలు సాగు చేసిన ప్రతి రైతు తప్పనిసరిగా పంట నమోదు చేయించుకోవడంతో పాటు ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన పథకంలో పేర్లు నమోదు చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి శ్రీమతి కే. నీరజ సూచించారు. బుధవారం ఎర్రగొండపాలెం మండలంలోని మిల్లంపల్లి గ్రామంలో వ్యవసాయ శాఖ, అనుబంధ శాఖల ఆధ్వర్యంలో నిర్వహించిన 'పొలం పిలుస్తుంది' కార్యక్రమంలో ఆమె రైతులకు పలు సూచనలు చేశారు.

పంటల బీమా ప్రీమియం వివరాలు ఇవే

రబీ 2026-27 సీజన్‌కు సంబంధించి పంటల బీమా ప్రీమియం వివరాలను వివరిస్తూ మినుములకు ఎకరాకు రూ.105, మిరపకు రూ.525, మొక్కజొన్నకు రూ.110, జొన్నకు రూ.60 చొప్పున ప్రీమియం నిర్ణయించినట్లు తెలిపారు. అర్హులైన రైతులందరూ ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పంటల బీమా నమోదు చేసుకోవడానికి డిసెంబర్ 15 చివరి తేదీ అని స్పష్టం చేశారు.

విత్తన మొక్కజొన్న రైతులు ఒప్పంద పత్రాలు తీసుకోవాలి

మండలంలో కొంత విస్తీర్ణంలో విత్తన మొక్కజొన్న సాగు చేస్తున్న నేపథ్యంలో ఆ పంట సాగు చేసిన రైతులందరూ సంబంధిత సంస్థల నుంచి తప్పనిసరిగా ఒప్పంద పత్రాలు తీసుకోవాలని సూచించారు.మొక్కజొన్న పంటలో కత్తెర పురుగు నివారణకు విత్తనాలను విత్తే ముందు కిలో విత్తనానికి నాలుగు మిల్లీలీటర్ల ఫోర్టెంజా డియో మందు కలిపి శుద్ధి చేయాలని తెలిపారు. కత్తెర పురుగు ఉధృతి అధికంగా ఉన్నప్పుడు ఎకరాకు 80 గ్రాముల ఇమామెక్టిన్ బెంజోయేట్ 5 ఎస్‌జీ మందును పిచికారీ చేయాలని సూచించారు. విషపు ఎరల వినియోగం ద్వారా కూడా కత్తెర పురుగును సమర్థవంతంగా నియంత్రించవచ్చని వివరించారు.మొక్కజొన్నలో జింక్ లోప నివారణకు లీటరు నీటికి రెండు గ్రాముల జింక్ సల్ఫేట్ కలిపి పిచికారీ చేయాలని రైతులకు సూచించారు.అనంతరం కార్యక్రమంలో పాల్గొన్న రైతులతో ఏపీఎఫ్ఆర్ పోర్టల్‌లో నమోదు ప్రక్రియ చేపట్టించారు. రైతులందరూ తమ పరిధిలోని రైతు సేవా కేంద్ర సిబ్బందిని సంప్రదించి పోర్టల్‌లో రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని మండల వ్యవసాయ అధికారి నీరజ కోరారు.ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల వ్యవసాయ సహాయకులు, రైతులు పాల్గొన్నారు.

చెంచుగిరిజనులకు ఉచిత స్పర్శదర్శనం



శ్రీశైలం నవంబర్ 25 (ప్రభాత కిరణమ్ న్యూస్): దేవస్థానం ప్రతీ నెలలో చివరి బుధవారం రోజున చెంచుగిరిజనులకు ప్రత్యేకంగా ఉచిత స్పర్శదర్శనం కల్పించాలని నిర్ణయించడం జరిగింది. ఇందులో భాగంగా 420 మందికి చెంచు గిరిజన భక్తులకు శ్రీస్వామివార్ల ఉచిత స్పర్శదర్శనం మరియు అమ్మవారి దర్శనం కల్పించబడింది. స్థానిక చెంచుగూడెములతో పాటు పలు చెంచు గూడెముల చెంచు గిరిజనులు స్పర్శదర్శనాన్ని చేసుకోవడం జరిగింది. దర్శనానంతరం చెంచు గిరిజన భక్తులందరికీ దేవస్థాన అన్నపూర్ణా ప్రసాదవితరణ భవనంలో అన్నప్రసాదాలు ఏర్పాటు చేయబడ్డాయి. చెంచుగిరిజన భక్తులు సంప్రదాయబద్దంగా తప్పెట వాయిద్యాలతో, చెంచు నృత్యాలతో దర్శనానికి విచ్చేశారు. వారికి ఉమారామలింగేశ్వరస్వామి ఆలయం వద్ద దేవస్థానం ధర్మకర్తల మండలి అధ్యక్షులు శ్రీ పోతుగుంట రమేష్‌నాయుడు, సంబంధిత అధికారులు వారికి ఆహ్వానం పలికారు. ఈ సందర్భంగా ధర్మకర్తల మండలి అధ్యక్షులు శ్రీ పోతుగుంట రమేష్‌నాయుడు మాట్లాడుతూ తాము పదవీబాధ్యతలను స్వీకరించిన వెంటనే స్థానిక మేకలబండ చెంచుగూడెములను సందర్శించానన్నారు. ఆ సందర్భంలో చెంచు భక్తులు తమకు స్వామివారి స్పర్శదర్శనాన్ని కల్పించవలసినదిగా కోరడం జరిగిందన్నారు. తదనుగుణంగా గత సంవత్సరం చెంచుభక్తులకు నెలలో ఒకరోజున ప్రత్యేకంగా ఉచిత స్పర్శదర్శనాన్ని కల్పించాలని ధర్మకర్తల మండలి సమావేశములో తీర్మానించడం జరిగిందన్నారు గత డిసెంబరు 30వ తేదీ నుంచి ఈ ఉచిత స్పర్శదర్శన కార్యక్రమాన్ని అమలు చేస్తున్నామన్నారు. శ్రీస్వామివారి ఉచిత స్పర్శదర్శనానికి చెంచుగిరిజన భక్తులను ఎంపిక చేయడంలో స్థానిక ఐ.టి.డి.ఏ ప్రాజెక్టు అధికారి వారి సహకారాన్ని తీసుకోవడం జరిగిందన్నారు.

గ్రామాల్లో పోలీసుల ఫ్లాగ్ మార్చ్



కొయ్యూరు, అల్లూరి జిల్లా నవంబర్ 25 (ప్రభాత కిరణమ్ న్యూస్): గ్రామాల్లో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలకు పాల్పడినా చట్ట ప్రకారం చర్యలు తప్పవని కొయ్యూరు సర్కిల్ ఇన్స్పెక్టర్ బి శ్రీనివాసరావు, ఎస్ ఐ లు కిషోర్ వర్మ, శ్రీనివాస్ లు అన్నారు. ఈ మేరకు మండల కేంద్రమైన రాజేంద్రపాలెం, కొయ్యూరు,సింగవరం మరియు రావణాపల్లి గ్రామాల్లో బుధవారం పోలీసుల ఆధ్వర్యంలో ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. ఈ ఫ్లాగ్ మార్చ్ లో అడిషనల్ ఎస్పీ (ఏ ఆర్) పాల్గొన్న ఈకార్యక్రమంలో సి ఐ మాట్లాడుతూ ఈ ఎన్నికలు ప్రశాంతంగా, స్వేచ్ఛగా మరియు నిష్పక్షపాతంగా జరిగేలా పోలీస్ శాఖ అన్ని ముందస్తు భద్రతా చర్యలు చేపడుతుందని ,ప్రజలు ఎలాంటి భయాందోళనలకు గురికాకుండా తమ ఓటు హక్కును వినియోగించాలని పోలీసులు తెలిపారు. ఎన్నికల సమయంలో శాంతిభద్రతలకు విఘాతం కలిగించే చర్యలకు ప్లాపడతే చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని సి ఐ శ్రీనివాసరావు ఎస్ ఐ లు హెచ్చరించారు.

తక్కువ ధరకే నాణ్యమైన బియ్యం..ధరణి కేంద్రం ప్రారంభం

కిలో రూ.50కే బియ్యం విక్రయం

ఆధార్ కార్డు చూపిస్తే 26 కిలోల ప్యాకెట్ రూ.1,300కే.



యర్రగొండపాలెం నవంబర్ 25 (ప్రభాత కిరణమ్ న్యూస్): రాష్ట్రంలో బియ్యం ధరలు అధికంగా పెరుగుతున్న నేపథ్యంలో సామాన్య ప్రజలకు తక్కువ ధరకు నాణ్యమైన బియ్యం అందించాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పౌరసరఫరాల సంస్థ ఆధ్వర్యంలో ధరణి బియ్యం విక్రయ కేంద్రాలను ఏర్పాటు చేస్తోంది. ఇందులో భాగంగా బుధవారం యర్రగొండపాలెం పట్టణంలోని ప్రభుత్వ ఏరియా వైద్యశాల సమీపంలో ఏర్పాటు చేసిన ధరణి బియ్యం కేంద్రాన్ని అధికారులు, కూటమి నాయకులు ప్రారంభించారు.ఈ కేంద్రం ద్వారా ఆధార్ కార్డు తీసుకొచ్చిన వినియోగదారులకు కిలో బియ్యం రూ.50 చొప్పున విక్రయిస్తున్నారు. 26 కిలోల బియ్యం ప్యాకెట్‌ను రూ.1,300కు అందజేస్తున్నట్లు అధికారులు తెలిపారు. మార్కెట్‌లో పెరుగుతున్న బియ్యం ధరలతో ఇబ్బందులు పడుతున్న సామాన్య,మధ్యతరగతి ప్రజలకు ఈ కేంద్రం ఎంతగానో ఉపయోగపడుతుందని పేర్కొన్నారు.ప్రజలకు అందుబాటు ధరల్లో నాణ్యమైన బియ్యం అందిస్తున్న ఈ అవకాశాన్ని పట్టణ ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని అధికారులు, కూటమి నాయకులు కోరారు.ఈ కార్యక్రమంలో జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి అంకయ్య, మండల తహసీల్దార్ జయలక్ష్మి, పౌరసరఫరాల డీటీ చంద్రశేఖర్, ఏఎంసీ చైర్మన్ చేకూరి సుబ్బారావు,వైస్ ఎంపీపీ, మండల అధ్యక్షుడు చిట్యాల వెంగళరెడ్డి, జెడ్పిటిసి మంత్ర నాయక్, సర్పంచ్ అభ్యర్థి కంచర్ల సత్యనారాయణ గౌడ్,టీడీపీ నాయకులు కొత్తమాసు అనంత సుబ్రహ్మణ్యం, తోట మహేష్ నాయుడు, కేసనపల్లి మల్లికార్జున, కందుల నారాయణరెడ్డి, పేరం రమణారెడ్డి, షేక్ ఇస్మాయిల్, మస్తాన్ వలి, చీదెళ్ల నాగేశ్వరరావు, ఒకటో వార్డు ఎంపీటీసీ పమిడిమర్రి కిషోర్, యక్కలి ప్రసాద్,గుప్త,చేదురి కిషోర్, నక్క రాముడు, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

నామినేషన్ల తిరస్కరణపై ఆర్డీవోను కలిసిన ఎమ్మెల్యే తాటిపర్తి



యర్రగొండపాలెం,ఆర్ సి నవంబర్ 25 (ప్రభాత కిరణమ్ న్యూస్): యర్రగొండపాలెం నియోజకవర్గం లోని పుల్లలచెరువు మండలంలోని ఎండ్రపల్లి,నరజాముల తండా గ్రామాలలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ తరపున సర్పంచ్ అభ్యర్థులు దాఖలు చేసిన నామినేషన్లను అధికారులు తిరస్కరించడంపై ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్ తీవ్ర నిరసన వ్యక్తం చేశారు.బుధవారం నాడు మార్కాపురంలోని ఆర్డీవో కార్యాలయాన్ని గ్రామ ప్రజలతో కలిసి భారీ ఎత్తున సందర్శించి నామినేషన్ల తిరస్కరణ వెనుక అధికారుల ఏకపక్ష వ్యవహారశైలి,టీడీపీ నాయకుల ఒత్తిళ్లకు అధికారులు తలొగ్గి వ్యవహరించిన తీరుపై ఆర్డీవో కు ఎమ్మెల్యే చంద్రశేఖర్ ఫిర్యాదు చేశారు.ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థుల హక్కులను కాలరాయడం సరికాదని,నిబంధనలకు విరుద్ధంగా నామినేషన్లను తిరస్కరించడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని స్పష్టం చేశారు.దీనిపై స్పందించిన ఆర్డీవో నామినేషన్ల పరిశీలనలో అవకతవకలు జరిగినట్లు నిరూపణ అయితే సంబంధిత అధికారులను పిలిపించి గ్రామ ప్రజల సమక్షంలోనే నామినేషన్లను మరోసారి పరిశీలించి,నిబంధనల ప్రకారం అభ్యర్థుల విషయంలో తగిన నిర్ణయం తీసుకుంటామని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు దోమకాల వెంకటేశ్వర్లు,మరియు మండల నాయకులు,మరియు ఎండ్రపల్లి గ్రామం,నరజాముల తండాకు చెందిన ప్రజలు, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు,కార్యకర్తలు భారీ సంఖ్యలో పాల్గొని తమ నిరసనను తెలియజేశారు.

ప్రజాసౌమ్యాన్ని హేళన చేసే తీరుగా పోలీస్ మరియు ఎన్నికల అధికారులు

శాసనసభ్యులు తాటిపర్తి.



యర్రగొండపాలెం, నవంబర్ 25 (ప్రభాత కిరణమ్ న్యూస్): పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో నియోజకవర్గంలోని యర్రగొండపాలెం మరియు త్రిపురాంతకం సిఐ లు మరియు ఎన్నికల అధికారులు ప్రవర్తిస్తున్న తీరుపై ఎర్రగొండపాలెం శాసనసభ్యులు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి తాటిపర్తి చంద్రశేఖర్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. నియోజకవర్గం లోని ఇరువురు సిఐ లను,ఆర్ ఓ లను కూటమి ప్రభుత్వ రౌడీలు గూండాలుగా సంభోదిస్తూ,వీరు వైకాపా సర్పంచ్ అభ్యర్థులను నామినేషన్ సెంటర్ల లోపలికి రానివ్వకుండా, నామినేషన్స్ వెయ్యకుండా అడ్డుకుంటూ,నామినేషన్స్ పత్రాలు చించి వేసి ప్రజాసౌమ్యాన్ని కూని చేస్తున్నారంటు ఆగ్రహం వ్యక్తం చేశారు.నామినేషన్ వేసిన కొందరిని వెరిఫికేషన్ పేరుతో అనర్హులుగా ప్రకటిస్తూ,వివరాలు చెప్పకుండా ఎన్నికల అధికారులు కూటమి ప్రభుత్వానికి కొమ్ము కాస్తున్నారని ద్వజమెత్తారు. బుధవారం నాడు మార్కాపురం ఆర్డిఓ కార్యాలయ ప్రాంగణంలో పాత్రికేయుల సమక్షంలో తెలుగుదేశం పార్టీ ప్రవర్తనా తీరుపై తీవ్ర విమర్శలు చేశారు.ఈ సందర్భంగా మార్కాపురం జిల్లా కేంద్రంలో ఆర్డీవోకు వినతిపత్రం సమర్పించారు.కూటమి ప్రభుత్వానికి పోలీస్ అధికారులు మరియు ఎన్నికల అధికారులు దత్తపుత్రులుగా మారారని ఎద్దేవా చేశారు.ప్రజాస్వామ్యాన్ని అపహస్యం చేసేలా తెలుగుదేశం పార్టీ వ్యవహరిస్తుందని ఆ పార్టీ తీరుపై ఆయన నిప్పులు చెరిగారు.ఎర్రగొండపాలెం సిఐ మరియు త్రిపురాంతకం సిఐలు తెలుగుదేశం పార్టీకి క్రియాశీలక కార్యకర్తలుగా వ్యవహరిస్తున్నారని తెలుగుదేశం పార్టీ విజయాన్ని వారి భుజస్కంధాలపై మోస్తున్నారని విమర్శించారు. ఎర్రగొండపాలెం నియోజకవర్గంలో నామినేషన్లు వేసిన వారి పత్రాలను తిరస్కరిస్తూ చింపివేస్తూ,బెదిరిస్తూ, అరాచకత్వానికి,పోలీసు అధికారులు పాల్పడుతున్నారని ఉన్నత అధికారులు ఈ విషయమై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. బెదిరింపులు,నామినేషన్ పత్రాల చింపివేతలు, అడ్డుకోవడాలు,అర్ధరాత్రి అరాచకత్వానికి పాల్పడడాలు,గుండా గిరి, రిగ్గింగులు,అధికార దుర్వినియోగం, తెలుగుదేశం పార్టీ విజయం కాదని విమర్శించారు.8 పంచాయతీ లలో అన్ని అర్హతలు ఉంది నలు సెట్లు నామినేషన్స్ వేసినా వారిని కారణాలు చెప్పకుండా వారిని అనర్హులుగా ప్రకటించారని, నియోజకవర్గంలో కుప్పలు తెప్పలుగా డబ్బులు అధికారుల చేతులు మారుతోందని,ప్రజలు గమనిస్తున్నారని,త్వరలో వారే బుద్ధి చెప్తారని తీవ్ర స్థాయిలో హెచ్చరించారు.

బైక్ ట్యాక్సీపై వెళ్లేప్పుడు హెల్మెట్ వాడుతున్నారా ఈ జాగ్రత్తలు పాటించాల్సిందే..



నగరాల్లో ట్రాఫిక్ రద్దీ పెరుగుతున్న నేపథ్యంలో తక్కువ దూరాలకు ప్రయాణించేందుకు బైక్ ట్యాక్సీలు ప్రజలకు సౌకర్యవంతమైన రవాణా మార్గంగా మారుతున్నాయి. మొబైల్ యాప్‌ల ద్వారా నిమిషాల్లోనే బైక్ ట్యాక్సీని బుక్ చేసుకునే అవకాశం ఉండడంతో చాలామంది వీటిని ఉపయోగిస్తున్నారు. అయితే ఈ ప్రయాణాల్లో చాలామంది ఒక ముఖ్యమైన విషయాన్ని పట్టించుకోవడం లేదు. అదే బైక్ ట్యాక్సీ డ్రైవర్లు ప్రయాణికులకు అందించే హెల్మెట్ల పరిశుభ్రత. వ్యక్తిగత హెల్మెట్‌ను ఒకరు మాత్రమే ఉపయోగిస్తారు కాబట్టి దాని శుభ్రతపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటారు. కానీ అద్దెకు ఇచ్చే హెల్మెట్‌ను రోజులో చాలామంది ఉపయోగిస్తుంటారు. దీంతో వాటి పరిశుభ్రతపై ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి.

బైక్ ట్యాక్సీ హెల్మెట్‌లలో ఏముంటాయి..?

హెల్మెట్ లోపలి భాగం నేరుగా తల, నుదురు, ముఖానికి తగులుతుంది. ఈ ప్రాంతాల్లో ఏర్పడే చెమట, చర్మంలోని నూనెలు, దుమ్ము కారణంగా హెల్మెట్ లోపలి పొర అపరిశుభ్రంగా మారుతుంది. ఒకే హెల్మెట్‌ను సరైన శుభ్రత పాటించకుండా పలువురు ఉపయోగిస్తే అందులో బ్యాక్టీరియా, శిలీంధ్రాలు పెరిగే అవకాశం ఉంటుంది. 2021లో మైక్రోఆర్గానిజమ్స్ జర్నల్‌లో ప్రచురితమైన అధ్యయనంలో నేపాల్‌లో మోటార్‌సైకిల్ ప్రయాణికులు ఉపయోగించే 130 హెల్మెట్లను పరిశీలించారు. వీటిలో మొత్తం 392 రకాల బ్యాక్టీరియా, 346 రకాల శిలీంధ్రాలను గుర్తించారు. వ్యక్తిగత హెల్మెట్లతో పోలిస్తే పలువురు ఉపయోగించే హెల్మెట్లలో సూక్ష్మజీవుల ఉనికి ఎక్కువగా ఉన్నట్లు తేలింది. తరచూ శుభ్రం చేయని హెల్మెట్లలో వీటి సంఖ్య అధికంగా ఉన్నట్లు పరిశోధకులు గుర్తించారు.

ఎలాంటి జాగ్రత్తలు పాటించాలి..

అపరిశుభ్రంగా, తడిగా ఉండే హెల్మెట్లను తరచూ ఉపయోగించడం వల్ల ఇప్పటికే తల చర్మం లేదా చర్మ సంబంధిత సమస్యలు ఉన్నవారిలో అవి మరింత తీవ్రమయ్యే అవకాశం ఉంది. ముఖ్యంగా తలపై ఇన్ఫెక్షన్లు, చర్మ సమస్యలు ఉన్నవారు, చర్మ రక్షణ పొర బలహీనంగా ఉన్నవారు మరింత జాగ్రత్తగా ఉండాలి. అయితే ఒక హెల్మెట్‌పై సూక్ష్మజీవులు ఉన్నంత మాత్రాన దానిని ఉపయోగించినవారికి తప్పనిసరిగా ఇన్ఫెక్షన్ వస్తుందని చెప్పలేమని నిపుణులు పేర్కొంటున్నారు. ఈ విషయంలో మరింత పరిశోధన అవసరమని చెబుతున్నారు. తరచూ బైక్ ట్యాక్సీల్లో ప్రయాణించేవారు వీలైనంత వరకు సొంత హెల్మెట్‌ను ఉపయోగించడం మంచిది. అలా సాధ్యం కానప్పుడు హెల్మెట్ శుభ్రంగా, పొడిగా, దుర్వాసన లేకుండా ఉందో లేదో పరిశీలించాలి. లోపలి పొర దెబ్బతిన్న హెల్మెట్లను ఉపయోగించకూడదు. హెల్మెట్ భద్రతకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా సరిపోయే వ్యక్తిగత లోపలి కవర్‌ను ఉపయోగించవచ్చు. తడిగా లేదా మురికిగా ఉన్న హెల్మెట్‌కు బదులుగా మరో శుభ్రమైన హెల్మెట్‌ను అడగాలి.

బైక్ ట్యాక్సీ యజమానులు ఏం చేయాలి..?

హెల్మెట్లను ఉపయోగించిన ప్రతిసారీ పూర్తిగా ఆరబెట్టడం, తయారీ సంస్థ సూచనల ప్రకారం వాటిని శుభ్రం చేయడం, అవసరమైనప్పుడు క్రిమిసంహారక చర్యలు చేపట్టడం బైక్ ట్యాక్సీ నిర్వాహకుల బాధ్యత. అయితే పరిశుభ్రత పేరుతో హెల్మెట్ భద్రతను నిర్లక్ష్యం చేయకూడదు. హెల్మెట్ తలకు సరిగ్గా సరిపోయేలా ఉండడంతోపాటు పట్టీని గట్టిగా బిగించాలి. ప్రపంచ ఆరోగ్య సంస్థ ప్రకారం, సరైన హెల్మెట్ వినియోగం ప్రాణాలను కాపాడే అవకాశాన్ని ఆరు రెట్లకు పైగా పెంచడంతోపాటు మెదడుకు గాయాలయ్యే ప్రమాదాన్ని 74 శాతం వరకు తగ్గిస్తుంది. కాబట్టి బైక్ ట్యాక్సీ ప్రయాణాల్లో రోడ్డు భద్రతతోపాటు వ్యక్తిగత పరిశుభ్రతకు కూడా సమాన ప్రాధాన్యత ఇవ్వాలి. ప్రయాణికులు, బైక్ ట్యాక్సీ సేవలందించే సంస్థలు ఇద్దరూ హెల్మెట్ల శుభ్రత విషయంలో బాధ్యతగా వ్యవహరించినప్పుడే సురక్షితమైన ప్రయాణం సాధ్యమవుతుంది.

రూ.20కే లభించే ఈ కూరగాయతో ఎంతో ఆరోగ్యం చలికాలంలో తప్పక తినాల్సిందే ఎందుకంటే..



చలికాలం వచ్చిందంటే రకరకాల ఆహార పదార్థాలు మనకు అందుబాటులోకి వస్తాయి. ముఖ్యంగా ఈ సీజన్‌లో లభించే కూరగాయలు ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయి. అలాంటి వాటిలో చిలగడదుంప (స్వీట్ పొటాటో) ప్రత్యేకమైనది. కేవలం రూ.20కే లభించే ఈ దుంపతో రోగనిరోధక శక్తిని పెంచుకోవచ్చని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు. కాల్చిన చిలగడదుంప ముక్కలపై కొద్దిగా చాట్ మసాలా, నిమ్మరసం చల్లుకుని తినడం ఈ సీజన్‌లో తీసుకోగలిగే ఉత్తమమైన ఆహారాల్లో ఒకటి.

కంటిచూపు పెరిగేందుకు..

చిలగడదుంపల్లో బీటా కెరోటిన్ సమృద్ధిగా ఉంటుంది. శరీరం దీనిని విటమిన్ ఎ గా మార్చుకుంటుంది. ఒక చిలగడదుంప తినడం ద్వారా శరీరానికి రోజువారీ అవసరమైన బీటా కెరోటిన్‌ను పొందవచ్చు. ఇది రోగనిరోధక శక్తిని పెంచడంతోపాటు చర్మ ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తుంది. కంటి చూపును కాపాడడంలో, జీర్ణవ్యవస్థ ఆరోగ్యంగా ఉండడంలోనూ సహాయపడుతుంది. ఇందులో ఉండే పీచు పదార్థం గుండె ఆరోగ్యానికి మేలు చేయడంతోపాటు చెడు కొలెస్ట్రాల్‌ను తగ్గించడంలో తోడ్పడుతుంది. పేగుల్లో మంచి బ్యాక్టీరియా వృద్ధికి కూడా సహకరిస్తుంది.

బీపీ తగ్గుతుంది..

చిలగడదుంపల్లో పొటాషియం కూడా ఉంటుంది. ఇది రక్తపోటును నియంత్రించడంలో కీలక పాత్ర పోషిస్తుంది. వీటిలోని యాంటీఆక్సిడెంట్లు శరీరంలో వాపును తగ్గించడంలో సహాయపడతాయి. అలాగే చిలగడదుంపలు శరీరానికి స్థిరమైన శక్తిని అందిస్తాయి. రక్తంలో చక్కెర స్థాయిలు ఒక్కసారిగా పెరగడానికి కారణం కావని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు. వీటిని ఉడికించి, కాల్చి తినడంతోపాటు కూరలు, వేపుళ్లు, చాట్ వంటి వివిధ రకాల వంటకాల్లోనూ ఉపయోగించుకోవచ్చు.

జాగ్రత్తలు తప్పనిసరి..

అయితే చిలగడదుంపలను అతిగా తినకూడదు. ముఖ్యంగా మధుమేహం ఉన్నవారు, తక్కువ కార్బొహైడ్రేట్లు తీసుకోవాలని వైద్యులు సూచించినవారు, సున్నితమైన జీర్ణవ్యవస్థ కలిగినవారు వీటిని తీసుకునే విషయంలో జాగ్రత్తగా ఉండాలి. అవసరమైతే వీటికి దూరంగా ఉండడం మంచిది. ప్రతి ఒక్కరూ తమ శరీర పరిస్థితిని, వైద్యుల సూచనలను పరిగణనలోకి తీసుకోవాలి. చలికాలంలో చిలగడదుంపలను ఆహారంలో చేర్చుకోవచ్చని, అయితే తీసుకునే పరిమాణం విషయంలో తప్పనిసరిగా నియంత్రణ పాటించాలని నిపుణులు సూచిస్తున్నారు.

ప్రీ డయాబెటిస్ అంటే ఏమిటి.. ఈ దశ నుంచి ఎలా బయట పడాలి నిపుణులు ఏం చెబుతున్నారు..?



ప్రపంచ మధుమేహ దినోత్సవాన్ని ప్రతి సంవత్సరం నవంబర్‌లో నిర్వహిస్తారు. మధుమేహంపై అవగాహన కల్పించడం, వ్యాధి నివారణ, ముందస్తు గుర్తింపు, చికిత్స ప్రాముఖ్యతను ప్రజలకు తెలియజేయడం ఈ రోజు ముఖ్య ఉద్దేశం. 2026 సంవత్సరానికి మధుమేహంపై ముందస్తు చర్యలు అనే ఇతివృత్తాన్ని నిర్ణయించారు. ఈ నేపథ్యంలో ప్రీడయాబెటిస్ గురించి తెలుసుకోవడం ఎంతో అవసరం. రక్తంలో చక్కెర స్థాయిలు సాధారణం కంటే ఎక్కువగా ఉన్నప్పటికీ, టైప్-2 మధుమేహంగా నిర్ధారించే స్థాయికి చేరుకోని పరిస్థితినే ప్రీడయాబెటిస్ అంటారు. ఈ దశలో సాధారణంగా స్పష్టమైన లక్షణాలు కనిపించవు. అందువల్ల చాలామందికి తమకు ఈ సమస్య ఉందనే విషయం కూడా తెలియదు.

ప్రీ డయాబెటిస్ అంటే..

శరీరం రక్తంలోని చక్కెర స్థాయిలను సమర్థవంతంగా నియంత్రించలేకపోవడం ప్రీడయాబెటిస్‌కు సంకేతం. దీన్ని గుర్తించేందుకు సాధారణంగా హెచ్‌బీఏ1సీ పరీక్ష నిర్వహిస్తారు. గత మూడు నెలల్లో రక్తంలో చక్కెర స్థాయిలు సగటున ఎలా ఉన్నాయో ఈ పరీక్ష తెలియజేస్తుంది. వ్యాధి నియంత్రణ, నివారణ కేంద్రాల ప్రకారం హెచ్‌బీఏ1సీ విలువ 5.7 శాతం కంటే తక్కువగా ఉంటే సాధారణ స్థాయిగా పరిగణిస్తారు. 5.7 నుంచి 6.4 శాతం మధ్య ఉంటే ప్రీడయాబెటిస్‌గా భావిస్తారు. 6.5 శాతం లేదా అంతకంటే ఎక్కువగా ఉంటే మధుమేహం ఉన్నట్లు సూచిస్తుంది. అయితే ప్రీడయాబెటిస్ ఉందంటే తప్పనిసరిగా మధుమేహం వస్తుందని కాదు. కానీ భవిష్యత్తులో టైప్-2 మధుమేహం, గుండె జబ్బులు, పక్షవాతం వచ్చే ప్రమాదం ఎక్కువగా ఉంటుందని ఇది హెచ్చరిస్తుంది. సరైన జీవనశైలి మార్పులతో చాలామందిలో రక్తంలో చక్కెర స్థాయిలను సాధారణ స్థాయికి తీసుకురావచ్చు. అయితే అలా వచ్చినంత మాత్రాన భవిష్యత్తులో మధుమేహం వచ్చే ప్రమాదం పూర్తిగా తొలగిపోయినట్లు కాదు.

బరువు తగ్గడం ముఖ్యం..

అధిక బరువు ఉన్నవారు తమ శరీర బరువులో 5 నుంచి 7 శాతం తగ్గించుకోవడం ద్వారా రక్తంలో చక్కెర నియంత్రణను మెరుగుపరచుకోవచ్చు. ఉదాహరణకు 80 కిలోల బరువున్న వ్యక్తి 4 నుంచి 5.6 కిలోల వరకు తగ్గించుకోవడం మంచి లక్ష్యం. ఇందుకోసం వేగంగా బరువు తగ్గించే పద్ధతులు కాకుండా, క్రమంగా బరువు తగ్గే ఆరోగ్యకరమైన విధానాలను అనుసరించాలి. వారానికి కనీసం 150 నిమిషాల పాటు శారీరక శ్రమ చేయాలని ప్రపంచ ఆరోగ్య సంస్థ సూచిస్తోంది. అంటే రోజుకు 30 నిమిషాల చొప్పున వారంలో ఐదు రోజులు వ్యాయామం చేయవచ్చు. వేగంగా నడవడం వంటి సాధారణ కార్యకలాపాలు కూడా ఉపయోగపడతాయి. ఆహారంలో కూరగాయలు, పీచు పదార్థాలు అధికంగా ఉండే ఆహారం, తగినంత ప్రోటీన్‌కు ప్రాధాన్యత ఇవ్వాలి. చక్కెర ఎక్కువగా ఉండే పదార్థాలు, శుద్ధి చేసిన పిండి పదార్థాలు, అధికంగా ప్రాసెస్ చేసిన ఆహారాలను తగ్గించాలి. పిండి పదార్థాలను పూర్తిగా మానేయాల్సిన అవసరం లేదు. తీసుకునే ఆహార పరిమాణంపైనా శ్రద్ధ పెట్టాలి.

వ్యాయామం చేయాల్సిందే..

రోజూ ఒకసారి వ్యాయామం చేయడమే కాకుండా, రోజంతా చురుకుగా ఉండడం కూడా ముఖ్యం. ఎక్కువసేపు కూర్చుని పనిచేసేవారు మధ్యమధ్యలో లేచి నడవడం, మెట్లు ఎక్కడం లేదా కొద్దిసేపు నిలబడి కదలడం అలవాటు చేసుకోవాలి. తగినంత నిద్రపోవడం, ఒత్తిడిని నియంత్రించుకోవడం కూడా రక్తంలో చక్కెర స్థాయిల నిర్వహణకు తోడ్పడతాయి. క్రమబద్ధమైన నిద్ర వేళలు పాటించడం, రాత్రిపూట ఎక్కువసేపు తెరలను చూడడం తగ్గించడం మంచిది. ప్రీడయాబెటిస్‌గా నిర్ధారణ అయినవారు వైద్యుల సూచన మేరకు నిర్ణీత వ్యవధుల్లో రక్తంలో చక్కెర, హెచ్‌బీఏ1సీ పరీక్షలు చేయించుకోవాలి. జీవనశైలిలో చేసిన మార్పులు ఎంతవరకు ఫలితాన్నిస్తున్నాయో ఈ పరీక్షల ద్వారా తెలుసుకోవచ్చు. అవసరమైతే వైద్యులు అదనపు చికిత్సను సూచిస్తారు. ప్రీడయాబెటిస్‌ను మధుమేహం వచ్చే ముందు జాగ్రత్త పడేందుకు లభించిన అవకాశంగా భావించి, ఇప్పటి నుంచే బరువు నియంత్రణ, వ్యాయామం, సమతుల ఆహారం, నిద్రపై శ్రద్ధ పెట్టడం ద్వారా టైప్-2 మధుమేహం వచ్చే ప్రమాదాన్ని తగ్గించుకోవచ్చని నిపుణులు చెబుతున్నారు.

భారీ గుమ్మడికాయను పండించిన రైతు.. బరువు ఏకంగా 969 కిలోలు..!

సాధారణంగా గుమ్మడికాయలు మూడు, నాలుగు కిలోల బరువు ఉంటాయి. మహా అయితే కొన్ని గుమ్మడికాయలు 10 కిలోల బరువు తూగుతాయి. అత్యంత అరుదుగా కొన్ని గుమ్మడి కాయలు సుమారుగా 20 కిలోల వరకు బరువు పెరగవచ్చు. కానీ ఆ రైతు (ఖ్యాతీఎవతీ) పండించిన గుమ్మడికాయ మాత్రం ఏకంగా 969 కిలోల బరువు ఉంది. అతిపెద్ద గుమ్మడికాయ ను పండించిన రైతుగా ఆయన రికార్డు సృష్టించాడు, వివరాల్లోకి వెళ్తే.. రష్యాకు చెందిన అలెగ్జాండర్ చుసోవ్ అనే రైతు అతిపెద్ద గుమ్మడికాయను పండించి రికార్డు నెలకొల్పాడు. మాస్కోలో జరిగిన భారీ కూరగాయల పోటీల్లో ఆ భారీ గుమ్మడికాయను ప్రదర్శించారు. దాని బరువు ఏకంగా 969 కిలోలు ఉంది. దాంతో అది రష్యాలోనే అతిపెద్ద గుమ్మడికాయగా రికార్డుల్లోకి ఎక్కింది. ఆ భారీ గుమ్మడి కాయను పండించేందుకు ఆరు నెలల కంటే ఎక్కువ సమయం పట్టిందని రైతు చుసోవ్ వెల్లడించారు. నేల, గాలిని వేడిచేసే ప్రత్యేక గ్రీన్ హౌస్‌ను నిర్మించి అందులో జాగ్రత్తగా దీన్ని పండించినట్లు చెప్పారు. ఎరువులు, నీటిని కచ్చితమైన మోతాదులో అందించినట్లు వివరించారు. ఈ పోటీల్లో దాదాపు మూడు వేల మంది రైతులు పాల్గొన్నారని నిర్వాహకులు తెలిపారు. కాగా పోటీల్లో 144 కేజీల బరువున్న పుచ్చకాయ ప్రత్యేక ఆకర్షణగా నిలిచిందని నిర్వాహకులు వెల్లడించారు.



పాలలో చక్కెర కలుపుకుని తాగితే అనారోగ్యమట చక్కెరే కాదు ఇవి కూడా కలుపొద్దట..!



పాలు ఆరోగ్యానికి ఎంతో మంచివి..! అయితే ఈ మాట ఒకప్పటి స్వచ్ఛమైన పాలకు మాత్రమే వర్తిస్తుంది. ఇప్పటి ప్రిజర్వ్‌డ్ పాలను ఆరోగ్యానికి మంచివి అనలేం. ఎందుకంటే ఈ ప్రిజర్వ్‌డ్ పాలతో కొత్తకొత్త వ్యాధులు పుట్టుకొస్తున్నాయి. ఈ పాలే ఆరోగ్యానికి మంచివి కాదంటే.. ఈ పాలలో రుచి, తీయదనం కోసం కొందరు వాటికి చక్కెర బెల్లం తేనె (నశీఅవ) లాంటివి కలిపి తీసుకుంటుంటారు. వివిధ రకాల పొడులు కలుపుతారు. అయితే పాలల్లో ఇలాంటివి కలుపుకోవడంవల్ల ఆరోగ్యానికి మరింత ముప్పు వాటిల్లుతుందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. మరి పాలలో కలుపగూడని ఆ పదార్థాలేమిటో ఇప్పుడు చూద్దాం..

చక్కెర

పాలు తాగే వాళ్లలో చాలామంది అందులో చక్కెర కలుపుకుంటారు. పిల్లలకు కూడా పాలల్లో పంచదార కలిపి తాగిస్తారు. కానీ ఇది ప్రమాదకరం అంటున్నారు ఆరోగ్య నిపుణులు. పాలల్లో పంచదార కలిపితే కేలరీలు మరింత పెరుతాయట. దాంతో ఆ పాలు తాగితే బరువు పెరుగుతారు. ఈ విషయం చాలా మందికి తెలియదు. అందుకే పంచదార కలిపి పాలు తాగుతారు. పాలు, పంచదార కలయిక జీర్ణక్రియపై కూడా ప్రభావం చూపుతుందట. ఎసిడిటీ, మల బద్ధకం, డయేరియా, పైల్స్ లాంటి సమస్యలు వస్తాయట.

చాక్లెట్ సిరప్

పాల రుచిని పెంచడానికి కొందరు చాక్లెట్ సిరప్ కలుపుకుంటారు. అయితే పాలల్లో చాక్లెట్ సిరప్ కలిపి తాగడం వల్ల శరీరంలో రిఫైన్ చేయని కొవ్వులు పెరుగుతాయి. ఇది కూడా బరువు పెరగడానికి, రక్తంలో షుగర్ లెవల్స్ పెరగడానికి కారణమవుతుంది. పలురకాల అనారోగ్య సమస్యలకు దారితీస్తుంది.

కెఫిన్

చాలామంది పాలతో టీ లేదా కాఫీ పౌడర్ కలిపి తాగుతారు. అది కూడా ఆరోగ్యానికి హానికరమే అంటున్నారు ఆరోగ్య నిపుణులు. కెఫిన్ పాలలో కలిపితే పాలలో పోషకాలను శరీరానికి అందకుండా చేస్తుంది. కెఫిన్ కారణంగా నిద్ర లేమి, హార్ట్ బీట్ పెరగడం, జీర్ణ సంబంధ సమస్యలు తలెత్తే అవకాశం ఉంది.

కృత్రిమ స్వీటెనర్స్

ఇక పాలలో తీపి పెరగడానికి కొందరు కృత్రిమ స్వీటెనర్లు వాడతారు. కానీ ఇవి చక్కెరకన్నా ప్రమాదకరమని పలు అధ్యయనాలు వెల్లడిస్తున్నాయి. కృత్రిమ స్వీటెనర్స్ కలపడం వల్ల వేగంగా బరువు పెరిగే ప్రమాదం ఉంది. కొవ్వులు పెరుగుతాయి. జీర్ణ సంబంధ సమస్యలు తలెత్తుతాయి.

మంచినీళ్లు తక్కువ తాగితేనే కాదు మరీ ఎక్కువ తాగినా ఆరోగ్యానికి హానికరమే..!



శరీరం డీ హైడ్రేషన్ కు గురికాకుండా తరచూ మంచి నీళ్లు తాగడం చాలా అవసరం. దాంతో కిడ్నీలు సహా శరీరంలోని సున్నితమైన అవయవాలన్నీ తాజాగా ఉంటాయి. కానీ ఆరోగ్యానికి మంచిది కదా అని అదేపనిగా మంచి నీళ్లు తాగితే అసలుకే మోసం వస్తుందని వైద్యులు హెచ్చరిస్తున్నారు. డీ హైడ్రేషన్ మాత్రమే కాదు, ఓవర్ హైడ్రేషన్ కూడా ఆరోగ్యానికి హానికరమేనని వారు చెబుతున్నారు. మరి ఓవర్ హైడ్రేషన్ వల్ల కలిగే ఆ దుష్ప్రభావాలు ఏమిటో ఇప్పుడు తెలుసుకుందాం..

ఓవర్ హైడ్రేషన్ దుష్ప్రభావాలు

చాలా మందికి డీహైడ్రేషన్ గురించి తెలుసుగానీ ఓవర్ హైడ్రేషన్ గురించి అంత అవగాహన ఉండదు. పరిమితికి మించి నీరు తాగితే ఈ సమస్య తలెత్తుతుంది. ముఖ్యంగా అథ్లెట్లలో ఇది ఎక్కువ కనిపిస్తుంది. ఓవర్ హైడ్రేషన్ అరుదైన సమస్యే కానీ అథ్లెట్లు తమ సామర్థ్యం పెంచుకునేందుకు నీళు ఎక్కువగా తాగుతారు. శరీరంలో నీరు తగినంత ఉంటే మరింత మెరుగ్గా క్రీడల్లో పాల్గొనవచ్చనేది వారి నమ్మకం. ఈ క్రమంలో శరీరంలో నీరు ఎక్కువై ఎలక్ట్రోలైట్ల (లవణాలు) స్థాయిల్లో మార్పులు వస్తాయి. ముందుగా సోడియం స్థాయి తగ్గిపోతుంది. దీంతో ఆలోచనల్లో స్పష్టత లోపించినట్టు ఉండటం, వాంతులు, కండరాల బలహీనత, పట్టేసినట్టు ఉండటం, తలనొప్పి వంటివి తలెత్తుతాయి. అత్యంత అరుదైన సందర్భాల్లో.. మెంటల్ కన్‌ఫ్యూజన్, ఫిట్స్‌తోపాటు కోమాలోకి కూడా వెళ్లొచ్చు. ఈ సమస్యలు తలెత్తకుండా ఉండాలంటే నీరు తాగే విషయంలోనూ నియంత్రణ పాటించాలని వైద్యులు చెబుతున్నారు. సాధారణంగా గంటకు ఒక లీటరుకు మించి నీటిని తాగకూడదని అంటున్నారు. ఈ పరిమితికి లోబడి ఉంటే శరీరంలోని అదనపు నీటిని తొలగించడానికి కిడ్నీలకు తగినంత సమయం దొరుకుతుంది. దాంతో శరీరంలోని ఎలక్ట్రోలైట్ బ్యాలెన్స్ ఆరోగ్యకర స్థాయిలో కొనసాగుతుంది. ఇదిలావుంటే ఓవర్ హైడ్రేషన్‌తో ఇన్‌ఫ్లమేషన్ తలెత్తిన సందర్భాల్లో పాటించాల్సిన కొన్ని చిట్కాలు ఉన్నాయి. పసుపు, అల్లం, ఆకు కూరలు, ఎక్స్‌ట్రా వర్జిన్ ఆలివ్ ఆయిల్, టమాటాలు, విత్తనాలు, గింజలు, గ్రీన్ టీతో ఈ ఇన్‌ఫ్లమేషన్‌ను తగ్గించుకోవచ్చు.

కొందరు పిల్లలు చిన్నతనం నుంచే గణితంలో నైపుణ్యం కలిగి ఉంటారు, కొందరు ఉండరు.. ఎందుకు..?



కొంతమంది పిల్లలకు గణితం నేర్చుకోవడం తోటి పిల్లలతో పోలిస్తే చాలా కష్టంగా ఉంటుంది. ఎంత సాధన చేసినా, ఉపాధ్యాయులు వివరించినా, ఇతర పిల్లలు సులభంగా పరిష్కరించే సమస్యలను వీరు పరిష్కరించలేకపోతుంటారు. దీనికి సంఖ్యలపై అవగాహన లేకపోవడమే కాకుండా, మెదడు ఆలోచించే విధానంలో తేడాలు కూడా కారణం అవుతాయని స్టాన్‌ఫోర్డ్ విశ్వవిద్యాలయ పరిశోధకుల తాజా అధ్యయనం వెల్లడించింది.

ఈ పరిస్థితిని ఏమంటారు..?

గణిత సమస్యలను పరిష్కరించడంలో నిరంతరం ఇబ్బందిపడే ఈ పరిస్థితిని అభివృద్ధి సంబంధిత డిస్కాల్కులియా అంటారు. జే న్యూరోసైన్స్ పరిశోధనా పత్రికలో ప్రచురితమైన ఈ అధ్యయనంలో 8 నుంచి 10 ఏళ్ల మధ్య వయసున్న 68 మంది పిల్లలను పరిశీలించారు. గణిత ప్రశ్నలకు సమాధానాలు కనుగొనేందుకు పిల్లలు ఎలాంటి పద్ధతులను ఉపయోగిస్తున్నారు, అవసరమైనప్పుడు వాటిని మార్చుకోగలుగుతున్నారా అనే అంశాలను పరిశోధకులు విశ్లేషించారు.

పిల్లలు ఎలా ప్రవర్తిస్తారు..

కొంతమంది పిల్లలు సంఖ్యలను ఒక్కొక్కటిగా లెక్కించి సమాధానం కనుగొంటారు. మరికొందరు తెలిసిన గణిత సంబంధాలను ఉపయోగించి వేగంగా పరిష్కరిస్తారు. ప్రశ్న కష్టతరమైనప్పుడు సరైన పద్ధతిని ఎంచుకోవడం ముఖ్యం. అయితే డిస్కాల్కులియా ఉన్న పిల్లలు ఒక పద్ధతి నుంచి మరో పద్ధతికి మారడానికి ఎక్కువ సమయం తీసుకున్నారని పరిశోధకులు గుర్తించారు. ప్రశ్నల కఠినత మారినప్పుడు దానికి అనుగుణంగా స్పందించడంలోనూ ఇబ్బందిపడ్డారు. కాలక్రమేణా మెరుగైన పద్ధతులను ఎంచుకోవడంలో ఇతర పిల్లల మాదిరిగా పురోగతి చూపలేదని అధ్యయనం తెలిపింది.

పిల్లల మెదడులోనే తేడాలు..

పిల్లల మెదడు కార్యకలాపాలను పరిశీలించినప్పుడు కూడా ప్రత్యేకమైన తేడాలు కనిపించాయి. ఈ కార్యకలాపాల నమూనాల ఆధారంగా పిల్లలు ఎంత సమర్థవంతంగా లెక్కలు వేస్తారు, సమస్యను పరిష్కరించే పద్ధతులను ఎంత సులభంగా మార్చుకుంటారు అనే విషయాలను అంచనా వేయగలిగారు. ఏకాగ్రత, జ్ఞాపకశక్తి, పరిస్థితులకు అనుగుణంగా ఆలోచనలను మార్చుకునే సామర్థ్యం కూడా గణితాన్ని నేర్చుకోవడంలో కీలక పాత్ర పోషిస్తాయని పరిశోధకులు పేర్కొన్నారు. ఈ మానసిక సామర్థ్యాలను కార్యనిర్వాహక సామర్థ్యాలు అంటారు. అయితే డిస్కాల్కులియా ఉన్న పిల్లలందరిలోనూ ఒకే రకమైన సమస్య ఉండదని పరిశోధకులు స్పష్టం చేశారు. ఒక్కో పిల్లవాడిలో వేర్వేరు మానసిక ప్రక్రియలు, మెదడు కార్యకలాపాలకు సంబంధించిన ఇబ్బందులు ఉంటాయి. మెదడులో కనిపించిన తేడాలే ఈ సమస్యకు ప్రత్యక్ష కారణమని అధ్యయనం నిరూపించలేదు. అయినప్పటికీ, పిల్లలు సరైన సమాధానం చెబుతున్నారా అనే విషయంతో పాటు, సమస్యను ఎలా పరిష్కరిస్తున్నారు, కష్టతరమైన ప్రశ్నలకు ఎలా స్పందిస్తున్నారు అనే అంశాలను పరిశీలించడం ద్వారా ఈ సమస్యను ముందుగానే గుర్తించి, తగిన సహాయం అందించవచ్చని పరిశోధకులు అభిప్రాయపడ్డారు.

EDITED, PUBLISHED AND OWNED BY N.MAHESHWAR REDDY PUBLISHED AT D.NO. 48-549, GANESH NAGAR, CHINTAL, QUTHBULLAPUR, MEDCHAL DIST. HYD -500054, TELANGANA. PRINTED AT SRI LAKSHMI OFFSET PRINTERS AND PUBLICATIONS D.NO. 48-549, GANESH NAGAR, CHINTAL, QUTHBULLAPUR, MEDCHAL DIST. HYDERABAD - 500 054. RNI TELTEL 2024/90138, CONTACT NO : 8985586689, EMAIL : suryavelugutelanganadesk@gmail.com, Web SITE : www.suryavelugu.com

బంగారు రుణాలకు బకాయిల సెగ



ఆరు నెలల్లో దాదాపు రెట్టింపైన ఎన్‌పీఏలు

జాగ్రత్తగా రుణాలివ్వాలని ఎన్‌బీఎఫ్‌సీలకు ఆర్బీఐ సూచన

బంగారం రుణాలకు బకాయిల సెగ గట్టిగానే తాకుతున్నది. దేశంలో వేగంగా విస్తరిస్తున్న తాకట్టు బంగారు రుణాల విభాగంలో వసూళ్ల ఒత్తిడి గరిష్ఠ స్థాయికి చేరుకున్నాయి. 2026 మార్చితో ముగిసేనాటికి 0.16 శాతంగా ఉన్న బంగారు రుణాల్లో నిరర్థక ఆస్తుల విలువ 2026 ఆగస్టు చివరి నాటికి 0.30 శాతానికి చేరిందని ట్రాన్స్‌యూనియన్ సిబిల్ తాజాగా వెల్లడించింది. బంగారం ధరలు భారీగా తగ్గడం, రుణగ్రహీతలపై అప్పుల భారం పెరగడం, రుణ నిబంధనల్లో మార్పులు రావడం వల్ల రుణదాతలకు కొత్త సవాళ్లు ఎదుర్కొవాల్సి వస్తున్నదని పేర్కొంది. దీంతో దూకుడుగా రుణాలివ్వొద్దని, బంగారు రుణాల పోర్ట్‌ఫోలియోలను మరింత జాగ్రత్తగా పరిశీలించాలని రిజర్వ్ బ్యాంక్..నాన్ బ్యాంకింగ్ ఫైనాన్స్ కంపెనీల హెచ్చరించింది. ఎన్‌బీఎఫ్‌సీ చీఫ్ ఎగ్జిక్యూటివ్‌లతో జరిగిన సమావేశంలో బంగారం ధరలు పడిపోవడంతో లోన్ టు వాల్యూ(ఎల్‌టీవీ) నిష్పత్తులు పెరగడం, తాకట్టు రక్షణ తగ్గడంపై ఆర్బీఐ ఆందోళన వ్యక్తం చేసినట్టు సమాచారం. ఎల్‌టీవీ అంటే తాకట్టుగా పెట్టిన బంగారం విలువతో పోలిస్తే ఇచ్చే రుణం నిష్పత్తి. వేగంగా పెరిగిన రుణాల నేపథ్యంలో ఆర్బీఐ ఈ జాగ్రత్త సూచనలు చేసింది. బంగారు నగలపై ఉన్న బకాయి రుణాలు 2026 సెప్టెంబర్‌లో ఏడాది ప్రాతిపదికన 66 శాతం పెరిగి రూ.3.74 లక్షల కోట్లకు చేరాయని సెంట్రల్ బ్యాంక్ గణాంకాలు వెల్లడించాయి. ఇది 2025 సెప్టెంబర్‌లో రూ.2.25 లక్షల కోట్లు, 2024 సెప్టెంబర్‌లో రూ.1.50 లక్షల కోట్లుగా ఉన్నాయి.

అధిక రుణ ఖాతాలే కారణం

బహుళ బంగారు రుణ ఖాతాలు ఉన్న రుణగ్రహీతలు వాయిదాల చెల్లింపుల్లో ఆలస్యాలకు ప్రధాన కారణమని ట్రాన్స్‌యూనియన్ సిబిల్ గుర్తించింది. ఇప్పటికే ఉన్న అప్పుల బాధ్యతలు తీర్చడంలో ఇబ్బంది పడుతున్న వారికి కూడా బంగారం తాకట్టుపై రుణాలు వెళ్తుండటంపై రంగంలోని అధికారులు ఆందోళన వ్యక్తం చేశారు. ఇటీవల రుణాల వసూళ్ల నాణ్యతలో వచ్చిన క్షీణతలో ఎక్కువ భాగం సవరించిన నియంత్రణ నిబంధనలకు రుణగ్రహీతలు అలవాటు పడుతున్న ప్రక్రియ వల్లేనని కూడా సంస్థ పేర్కొన్నది. బంగారు రుణాల వృద్ధి బలంగానే కొనసాగుతున్నప్పటికీ, పెరుగుతున్న బకాయిలు, ఒకే వ్యక్తి పలుచోట్ల రుణాలు తీసుకోవడం, బంగారం ధరల్లో ఒడిదుడుకులు మరింత నిశిత పర్యవేక్షణ అవసరాన్ని సూచిస్తున్నాయి. ప్రస్తుతం కనిపిస్తున్న చెల్లింపుల ఒత్తిడి తాత్కాలికమేనా లేక అధిక రుణ నష్టాలకు దారితీస్తుందా అన్నది కీలక ప్రశ్నగా మారింది.

దేశీయ మార్కెట్‌లో 10 గ్రాముల బంగారం ధర జనవరిలో సుమారు రూ.1.80 లక్షల గరిష్ఠం నుంచి 30 శాతానికిపైగా తగ్గి దాదాపు రూ.1.25 లక్షలకు పడిపోయింది. బంగారం ధరలు తగ్గితే రుణదాతల ఎల్‌టీవీ నిష్పత్తి పెరుగుతుంది. రుణ చెల్లింపులు ఆగిపోయినప్పుడు నష్టాలను భరించేందుకు తాకట్టుపై ఉండే రక్షణ కూడా తగ్గే అవకాశం ఉన్నది. సంప్రదాయంగా గడువు చివర ఒకేసారి చెల్లించే రీపేమెంట్లకు బదులు, నిర్ణీత వ్యవధులకు వడ్డీ చెల్లింపులు, ఈఎంఐ ఆధారిత రుణ ఉత్పత్తులు రావడం కూడా కొందరు రుణగ్రహీతలకు సర్దుబాటు సమస్యలు ఎదుర్కొవాల్సి వస్తున్నది. అధిక ప్రాతిపదిక, మందగించిన డిమాండ్, బంగారం ధరల తగ్గుదల కారణంగా బంగారు రుణాల నిర్వహణలోని ఆస్తుల ఏయూఎం వృద్ధి 2026-27 ఆర్థిక సంవత్సరంలో 40 శాతానికి తగ్గవచ్చని క్రిసిల్ రేటింగ్స్ అంచనా వేసింది. 2025-26లో ఈ వృద్ధి 78 శాతంగా ఉన్నదని తెలిపింది.

కార్ల ధరలకు రెక్కలు.. వరుసగా ధరలు పెంచుతున్న ఆటోమొబైల్ సంస్థలు

తాజాగా హ్యుందాయ్, ఆడీ, టాటా మోటర్స్ కూడా..

నూతన సంవత్సరంలో కార్లను కొనుగోలుచేయాలనుకునేవారికి షాకివ్వబోతున్నాయి దేశీయ, అంతర్జాతీయ ఆటోమొబైల్ సంస్థలు. ఇప్పటికే పలు సంస్థలు తమ వాహన ధరలను పెంచగా.. తాజాగా ఇదే జాబితాలోకి మరో మూడు సంస్థలు చేరాయి. వీటిలో దేశీయ కార్ల తయారీలో రెండో అతిపెద్ద సంస్థ హ్యుందాయ్‌తోపాటు టాటా మోటర్స్, ఆడీ కూడా ఉన్నది. ఉత్పత్తి వ్యయాలు అధికం కావడంతోపాటు నిర్వహణ ఖర్చులు పెరగడం కూడా తమ ధరల పెంపునకు ప్రధాన కారణాలని ఆటోమొబైల్ సంస్థలు వెల్లడిస్తున్నాయి.

పశ్చిమాసియాలో నెలకొన్న ఉద్రిక్త పరిస్థితుల కారణంగా ఉక్కు, అల్యుమినియం ధరలతోపాటు ఇంధన ధరలు కూడా అధికం కావడంతో సంస్థలపై అదనపు భారం పడుతున్నది. ఈ భారాన్ని తగ్గించుకోవడంలో భాగంగా సంస్థలు వాహన ధరల పెంపునకు మొగ్గుచూపుతున్నాయి. ఒక ఆటోమొబైల్ కంపెనీ మొత్తం వ్యయాల్లో కమోడిటీ వ్యయాల వాటా దాదాపు 60-65 శాతం ఉంటుందని అంచనా. ప్రపంచ నౌకా రవాణా చార్జీల సూచిక అయిన బాల్టిక్ డ్రై ఇండెక్స్ గతేడాదితో పోలిస్తే పెరిగింది. గత ఏడాది సెప్టెంబర్‌లో 2,124 పాయింట్లుగా ఉన్న ఈ సూచిక, ఈ ఏడాది సెప్టెంబర్‌లో 3,408 పాయింట్లకు చేరింది

8 వేలు పెరగనున్న హ్యుందాయ్ కార్లు

హ్యుందాయ్ సంస్థ కొనుగోలుదారులకు షాకిచ్చింది. వచ్చే నెల 1 నుంచి అమలులోకి వచ్చేలా అన్ని రకాల వాహన ధరలను రూ.8



వేల వరకు పెంచుతున్నట్టు తాజాగా ప్రకటించింది. ఈ విషయాన్ని స్టాక్ ఎక్స్చేంజ్‌లకు సమాచారం అందించింది. సంస్థ తీసుకున్న తాజా నిర్ణయంతో ఆయా మాడళ్లు మరింత ప్రియంకాబోతున్నాయి. ఉత్పత్తి వ్యయాలు అధికం కావడం వల్లనే ధరలు పెంచాల్సి వచ్చిందని హ్యుందాయ్ వర్గాలు వెల్లడించాయి. అంతర్గత సామర్థ్యాలు, వ్యయ నియంత్రణ చర్యలతో పెరుగుతున్న ఖర్చుల్లో గణనీయమైన భాగాన్ని కంపెనీ ఇప్పటివరకు భరిస్తూ వచ్చిందని, కానీ అంతర్జాతీయంగా నెలకొన్న ఉద్రిక్త పరిస్థితుల కారణంగా ధరల పెంపు అనివార్యమైందని పేర్కొంది. ఇప్పటికే సంస్థ ఈ ఏడాది మూడుసార్లు.. జనవరి, జూన్, సెప్టెంబర్‌లోనూ ధరలు పెంచింది.

టాటా మోటర్స్ ఈవీలు ప్రియం..

టాటా మోటర్స్ ప్యాసింజర్ వెహికల్స్ లిమిటెడ్ మంగళవారం తన మొత్తం వాహన శ్రేణి ధరలను 0.5 శాతం పెంచుతున్నట్లు ప్రకటించింది. ఈ సవరణ డిసెంబర్ 1 నుంచి అమల్లోకి రానున్నది. అంతర్గత దహన ఇంజిన్ వాహనాల శ్రేణి, ఎలక్ట్రిక్ వాహనాలు రెండింటికీ ఈ పెంపు వర్తిస్తుందని టాటా మోటర్స్ ప్యాసింజర్ వెహికల్స్ తెలిపింది. మాడళ్లు, వేరియంట్లను బట్టి పెంపు మారుతుందని పేర్కొంది. ఇన్‌పుట్ వ్యయాలు నిరంతరం పెరగడమే ధరల సవరణకు కారణమని కంపెనీ తెలిపింది.

ఆడీ వాహనాలు కూడా..

జర్మనీకి చెందిన లగ్జరీ కార్ల తయారీ సంస్థ ఆడీ..భారత్‌లోని తన మాడళ్ల ఎక్స్‌షోరూం ధరలను 2027 జనవరి 1 నుంచి గరిష్ఠంగా 2 శాతం పెంచనున్నట్లు తెలిపింది. పెరుగుతున్న ఇన్‌పుట్ వ్యయాలను భర్తీ చేసుకోవడానికే ఈ నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించింది. 2026లో ఆడీ ఇండియాకు ఇది రెండో ధరల సవరణ. ఈ ఏడాది ఏప్రిల్ 1 నుంచి అన్ని మోడళ్ల ధరలను గరిష్ఠంగా 2 శాతం పెంచింది. ఈ ధరల సవరణ తమ మొత్తం మాడళ్లకు వర్తిస్తుందని కంపెనీ ఒక ప్రకటనలో తెలిపింది. 'పెరుగుతున్న ఇన్‌పుట్ వ్యయాల నేపథ్యంలో ధరలను గరిష్ఠంగా 2 శాతం సవరించనున్నాం. మా వ్యాపార దీర్ఘకాలిక స్థిరత్వానికి ఈ సవరణ అవసరం. పెంపును సాధ్యమైనంత మితంగానే ఉంచాం. బ్రాండ్‌పై వినియోగదారుల నమ్మకాన్ని బలోపేతం చేసే యాజమాన్య అనుభవాన్ని అందించడంపైనే మా దృష్టి ఉంటుందని ఆడీ ఇండియా బ్రాండ్ డైరెక్టర్ బల్బీర్ సింగ్ ధిల్లాన్ తెలిపారు. ప్రస్తుతం సంస్థ ఏ4, ఏ6 సెడాన్లు, క్యూ3, క్యూ5, క్యూ7, క్యూ8, ఎస్‌క్యూ8, ఆర్‌ఎస్‌క్యూ8 మాడళ్లను దేశవ్యాప్తంగా విక్రయిస్తున్నది.

బంగారం మళ్లీ పరుగు

రూ.1,500 పెరిగిన తులం విలువ

న్యూఢిల్లీ, నవంబర్ 23: బంగారం ధరలు మళ్లీ పుంజుకున్నాయి. గత కొన్ని రోజులుగా తగ్గుతూ సామాన్యుడికి ఊరట కల్పించిన అతి విలువైన లోహాలు ధరలు మళ్లీ పుంజుకున్నాయి. స్థానిక కొనుగోళ్లు, అంతర్జాతీయ మార్కెట్ల బలమైన ధోరణులతో సోమవారం న్యూఢిల్లీ బులియన్ మార్కెట్లో 99.9 శాతం స్వచ్ఛత కలిగిన పదిగ్రాముల గోల్డ్ ధర రూ.1,500 ఎగబాకి రూ.1,26,800కి చేరుకున్నది. గత పది రోజులుగా తగ్గుతూ వచ్చిన ధరలు మళ్లీ పెరిగినట్టు అయిందని బులియన్ వర్తకులు వెల్లడించారు. బంగారంతోపాటు వెండి ధరలు కూడా పుంజుకున్నాయి. పారిశ్రామిక వర్గాలు, నాణేల తయారీదారుల నుంచి కొనుగోళ్ళు ఊపందుకోవడంతో కిలో వెండి రూ.2 వేలు అందుకొని రూ.1.57 లక్షలకు చేరుకున్నది. అంతకుముందు ఇది రూ.1.55 లక్షలుగా ఉన్నది. 'అంతర్జాతీయ మార్కెట్లలో లాభాలు, కొనసాగుతున్న పెండ్లిళ్ల సీజన్‌లో నగల కొనుగోళ్లు పెరుగుతాయన్న అంచనాలతో సోమవారం బంగారం ధరలు పైకి కదిలాయని హెచ్‌డీఎఫ్‌సీ సెక్యూరిటీస్ కమోడిటీస్ సీనియర్ అనలిస్ట్ సౌమిల్ గాంధీ తెలిపారు. ఇటీవలి ధరల తగ్గుదలతో వినియోగదారులకు బంగారం మరింత ఆకర్షణీయమైన స్థాయికి వచ్చిందని, పెండ్లిళ్ల సీజన్ ముందుకు సాగే కొద్దీ కాలానుగుణ కొనుగోళ్ల ఆసక్తి బలపడుతుందని గాంధీ చెప్పారు. ధరలు తగ్గిన తర్వాత వినియోగదారుల ఆసక్తి మళ్లీ పెరిగినట్లు గత వారం భారత్, చైనాల్లో వాస్తవ కొనుగోళ్ల డిమాండ్‌లోనూ ఇదే తరహా మెరుగుదల కనిపించిందని ఆయన తెలిపారు. తక్కువ దేశీయ ధరలు తక్కువకు బంగారం కొనాలనుకునే వారిని మళ్లీ వాస్తవ బంగారం కొనుగోళ్లవైపు తీసుకొచ్చాయని చెప్పారుతెలిపారు. రూపాయి స్వల్పంగా బలహీనపడడం కూడా ధరలు పెరగడానికి పరోక్షంగా దోహదం చేసిందన్నారు. అంతర్జాతీయ మార్కెట్లో స్పాట్ బంగారం ఔన్స్‌కు 84.27 డాలర్లు లేదా 2.38 శాతం పెరిగి 3,622.38 డాలర్లకు చేరుకోగా, వెండి 3.3 శాతం పెరిగి 42.59 డాలర్లకు చేరింది. గతవారంలో 9 శాతం పడిపోయి 14 నెలల కనిష్ఠానికి చేరిన



తర్వాత, అమెరికా ట్రెజరీ కార్యదర్శి స్కాట్ బెస్సెంట్ వడ్డీరేట్లను అతిగా కఠినతరం చేయొద్దని హెచ్చరించడంతో ట్రేడర్లు డిసెంబర్‌లో ఫెడరల్ రిజర్వ్ (ఫెడ్) వడ్డీరేట్ల పెంపు అంచనాలను తగ్గించుకున్నారు. దీంతో బంగారం 2 శాతానికి పైగా పుంజుకుని ఔన్స్‌కు 3,630 డాలర్లు సమీపానికి చేరింది.

హైదరాబాద్‌లో మౌంట్ ప్లాంట్



శాండ్‌విచ్ పీయూఎఫ్ ప్యానళ్ల తయారీలో ఉన్న మౌంట్ రూఫింగ్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్స్ ప్రైవేట్ లిమిటెడ్ హైదరాబాద్‌లో కొత్త తయారీ కేంద్రాన్ని ప్రారంభించిందని కంపెనీ తెలిపింది. తెలంగాణలో పారిశ్రామిక విస్తరణకు, దేశీయ తయారీ మౌలిక వసతుల బలోపేతానికి ఇది కీలక అడుగని పేర్కొంది. కొత్త కేంద్రంలో తెలంగాణలోనే తొలి నిరంతర శాండ్‌విచ్ పీయూఎఫ్ ప్యానల్ తయారీ లైన్‌ను ఏర్పాటు చేసినట్టు మౌంట్ తెలిపింది. దీనివల్ల అధునాతన ఇన్సులేటెడ్ ప్యానళ్ల తయారీ సామర్థ్యం రాష్ట్రానికి అందుబాటులోకి వచ్చి, పారిశ్రామిక, మౌలిక వసతుల ప్రాజెక్టులకు నాణ్యమైన నిర్మాణ సామగ్రి సరఫరా పెరుగుతుందని వివరించింది. సుమారు లక్ష చదరపు అడుగుల విస్తీర్ణంలో ఏర్పాటుచేసిన ఈ కేంద్రంలో మూడు ఉత్పత్తి లైన్లకు అవకాశముందని కంపెనీ వర్గాలు వెల్లడించారు. వీటిలో రెండు నిరంతర శాండ్‌విచ్ పీయూఎఫ్ ప్యానల్ తయారీ లైన్లు, ఒక ప్రత్యేక రాక్‌వూల్ శాండ్‌విచ్ ప్యానల్ ఉత్పత్తి లైన్ ఉన్నాయని కంపెనీ తెలిపింది. మొదటి నిరంతర శాండ్‌విచ్ పీయూఎఫ్ ప్యానల్ లైన్ ఇప్పటికే కార్యకలాపాలు ప్రారంభించిందని, దీని ద్వారా నెలకు 3 లక్షల చదరపు మీటర్ల ప్యానళ్లను తయారుచేయవచ్చని పేర్కొంది. అదే కేంద్రంలో రెండో శాండ్‌విచ్ పీయూఎఫ్ ప్యానల్ లైన్‌ను కూడా ఏర్పాటు చేయాలని కంపెనీ యోచిస్తున్నది. వచ్చే 8 నుంచి 10 నెలల్లో అందుబాటులోకి రానున్న ఈ కొత్త యూనిట్‌తో నెలకు మరో 3 లక్షల చదరపు మీటర్ల ఉత్పత్తి సామర్థ్యం చేరుతుందని పేర్కొంది. ఈ రెండు నిరంతర శాండ్‌విచ్ పీయూఎఫ్ ప్యానల్ లైన్లతో కలిపి నెలకు 6 లక్షల చదరపు మీటర్ల ఉత్పత్తి సామర్థ్యం వస్తుందని తెలిపింది.

లాభాల స్వీకరణ దిశగా..!

మార్కెట్ పల్స్



దేశీయ స్టాక్ మార్కెట్లు లాభాల్లో కదలాడుతున్నాయి. అంతకుముందు వారం ముగింపుతో పోల్చితే గత వారం బాంబే స్టాక్ ఎక్స్చేంజ్ ప్రధాన సూచీ సెన్సెక్స్ 2,327.26 పాయింట్లు పెరిగి 83,919.71 వద్ద నిలిచింది. నేషనల్ స్టాక్ ఎక్స్చేంజ్ సూచీ నిఫ్టీ 656.30 పాయింట్లు అందుకొని 25,800.60 దగ్గర ఆగింది. విదేశీ మదుపర్ల నుంచి పెట్టుబడుల ప్రవాహం, అంతర్జాతీయ మార్కెట్లో తగ్గుతున్న ముడి చమురు ధరలు, డాలర్‌తో పోలిస్తే బలపడిన రూపాయి మారకం విలువ, ఆకట్టుకున్న బ్యాంకింగ్ షేర్లు కలిసొచ్చాయి. అయితే ద్రవ్యోల్బణం సవాళ్లు, వచ్చే నెల రిజర్వ్ బ్యాంక్ వడ్డీరేట్ల పెంపు అంచనాల మధ్య ఈ వారం లాభాల స్వీకరణకు వీలుందన్న అంచనాలు వినిపిస్తున్నాయి. అమెరికా-ఇరాన్ మధ్య మళ్లీ యుద్ధ మేఘాలు కమ్ముకుని ముడి చమురు ధరలు పెరిగితే సూచీలు నష్టాల్లోకి జారుకోవచ్చన్న అభిప్రాయాలూ వ్యక్తమవుతున్నాయి. ఈ క్రమంలోనే ఈ వారం బ్యాంకింగ్, ఫైనాన్స్, రియల్టీ, స్టీల్ రంగాల షేర్లలో అమ్మకాల ఒత్తిడి కనిపించవచ్చన్నది ఎక్స్‌పర్ట్స్ మాట. కాగా, అమ్మకాల ఒత్తిడి కనిపిస్తే నిఫ్టీకి 25,500 పాయింట్ల స్థాయి కీలకమైనదనుకోవచ్చు. దీనికి దిగువన ముగిస్తే 25,300 పాయింట్ల స్థాయిని మద్దతుగా చెప్పుకోవచ్చని అత్యధిక నిపుణుల అంచనా. అయితే సూచీలు పరుగందుకుంటే ఈ వారం నిఫ్టీ 26,000-26,200 పాయింట్ల స్థాయికి వెళ్లవచ్చని కూడా చెప్తున్నారు. స్టాక్ మార్కెట్ పెట్టుబడులు రిస్క్‌తో కూడుకున్నవి. వివిధ దేశ, విదేశీ పరిణామాలు ట్రేడింగ్‌ను ఎక్కువగా ప్రభావితం చేస్తుంటాయి. కాబట్టి ఇక్కడ ఒడిదుడుకులు చాలా సహజం. పెట్టుబడులు పెట్టే ముందు ఆర్థిక నిపుణుల సలహా తీసుకోవడం, ఆయా సాధనాల డాక్యుమెంట్లను క్షుణ్ణంగా చదువుకోవడం ఉత్తమం. అలాగే పైన పేర్కొన్న వివరాలు విశ్లేషకుల అభిప్రాయం మాత్రమే. దీనికి మా పత్రిక ఎటువంటి బాధ్యత వహించదు. ఎవరి పెట్టుబడులకు వారిదే పూర్తి బాధ్యత. అవగాహన కోసమే ఈ మార్కెట

ఏఐ, పరిశోధనల కేంద్రంగా హైదరాబాద్

ఐరాస వేదికగా నిర్వహించిన గ్లోబల్ ఇంపాక్ట్ సమ్మిట్ లో మంత్రి శ్రీధర్ బాబు



పరిశోధన, సాంకేతిక ఆధారిత వ్యాపారాలకు అంతర్జాతీయ కేంద్రంగా హైదరాబాద్‌ను తీర్చిదిద్దడమే తమ ప్రభుత్వ లక్ష్యమని ఐటీ, పరిశ్రమల శాఖల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు వెల్లడించారు. ఐరాస వేదికగా 1ఎమ్1బీ సంస్థ నిర్వహించిన గ్లోబల్ ఇంపాక్ట్ సమ్మిట్‌లో శుక్రవారం ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రం ఇప్పటికే ఐటీ, లైఫ్ సైన్సెస్, ఫార్మాస్యూటికల్స్ రంగాల్లో అంతర్జాతీయ గుర్తింపు సాధించిందని, ప్రస్తుతం ఏఐ, అధునాతన తయారీ సహా నూతన సాంకేతిక రంగాల్లోనూ వేగంగా విస్తరిస్తుండటంతో ఈ రంగంలో భారీగా అవకాశాలున్నాయని అంతర్జాతీయ ప్రతినిధులకు వివరించారు. ప్రతిభావంతులైన యువత, పరిశ్రమలకు అనుకూలమైన విధానాలు, బలమైన పారిశ్రామిక పునాదులు రాష్ట్రానికి ప్రధాన బలమని తెలిపారు. సాంకేతిక అభివృద్ధి కేవలం ఆర్థిక వృద్ధికే పరిమితం కాకుండా ప్రజల జీవితాల్లో గుణాత్మక మార్పు తీసుకురావాల్సిన అవసరం ఎంతైనా ఉన్నదని అభిప్రాయపడ్డారు. ఏఐ, డిజిటల్ ఆవిష్కరణలను వైద్యం, విద్య, పర్యావరణ పరిరక్షణ, ఉపాధి వంటి రంగాల్లో వినియోగించడం ద్వారా అనేక సమస్యలకు పరిష్కారాలు అందుబాటులోకి వస్తాయని ఆశాభావం వ్యక్తం చేశారు. సాంకేతిక ప్రగతి, ఆవిష్కరణలు, మానవాభివృద్ధి సమాంతరంగా సాగినప్పుడే సమాజానికి నిజమైన ప్రయోజనం చేకూరుతుందని పేర్కొన్నారు. ప్రభుత్వాలు, అంతర్జాతీయ సంస్థలు సమన్వయంతో పనిచేసినప్పుడే బలమైన ఆవిష్కరణల వ్యవస్థ ఏర్పడుతుందన్నారు. ఆ దిశగా తమ ప్రభుత్వం ఇన్నోవేషన్ ఆధారిత ఎకో సిస్టంను రాష్ట్రంలో అభివృద్ధి చేస్తున్నదని తెలిపారు.' పల్స్.

ఫ్లిప్‌కార్ట్ సీఈవో రాజీనామా..11 ఏండ్ల ప్రయాణానికి ముగింపు



వాల్‌మార్ట్ యాజమాన్యంలోని ఫ్లిప్‌కార్ట్ సీఈఓ కల్యాణ్ కృష్ణమూరి తన పదవికి రాజీనామా చేశారు. భారతదేశపు అత్యంత విజయవంతమైన స్వదేశీ ఇ-కామర్స్ కంపెనీలలో ఒకటైన ఈ సంస్థకు దశాబ్దకాలంగా సారథ్యం వహించిన ఆయన ప్రస్థానం ముసిందని బుధవారం సంస్థ ఈ విషయాన్ని అధికారికంగా ప్రకటించింది. ఆయన డిసెంబర్ 4, 2026న తన బాధ్యతల నుంచి తప్పుకోనున్నారు. దీనితో ఫ్లిప్‌కార్ట్‌లో ఆయన 11 ఏళ్లకు పైగా సాగిన సుదీర్ఘ ప్రస్థానానికి తెరపడనుంది. కొత్త సీఈఓను నియమించే వరకు, చీఫ్ ప్రొడక్ట్ అండ్ టెక్నాలజీ ఆఫీసర్ (జ్యూ) బాలాజీ త్యాగరాజన్ ఫ్లిప్‌కార్ట్ బోర్డు సంస్థ కార్యకలాపాలను పర్యవేక్షిస్తారు. 2018లో ఫ్లిప్‌కార్ట్‌కు సీఈవో అయిన కల్యాణ్ కృష్ణమూర్తి ప్రత్యర్థి సంస్థలైన మీషో, అమెజాన్ నుంచి గట్టి పోటీ ఉన్నప్పటికి ఫ్లిప్‌కార్ట్ స్థిరంగా నిలపడంలో కీలక పాత్ర పోషించారు. మరీ ముఖ్యంగా జెన్‌జీ కస్టమర్లను ఆకట్టుకోవడంలో కల్యాణ్ కృష్ణమూర్తి విశేషంగా కృషి చేశారని చెప్తారు. అలాగే ఫుడ్ డెలివరీ రంగంలోకి అడుగుపెట్టి జెప్టో, బ్లింకిట్ కు పోటీగా ఫ్లిప్‌కార్ట్ మినిట్స్ ను తీసుకురావడంపై దృష్టి పెట్టారు. కాగా, కల్యాణ్ కృష్ణమూర్తి రాజీనామాకు గల కచ్చితమైన కారణాలను సంస్థ వెల్లడించలేదు. అయితే, ఫ్లిప్‌కార్ట్ ఐపీఓ జాప్యం, ఇటీవలి కాలంలో పలువురు సీనియర్ ఎగ్జిక్యూటివ్‌ల నిష్క్రమణ, ఉద్యోగుల ఈఎస్‌పీపీ విధానాలపై నెలకొన్న అనిశ్చితి వంటి పరిస్థితుల నడుమ ఈ కీలక మార్పు చోటుచేసుకుందని వ్యాపార వర్గాలు పేర్కొంటున్నాయి

కృత్రిమ మేధతో భద్రం: ఐఆర్‌డీఏఐ



ముంబై, నవంబర్ 20: దేశీయ బీమా రంగంలో దాదాపు 85 శాతం కంపెనీలు కృత్రిమ మేధస్సు (ఏఐ)ను వాడుతున్నాయని భారత బీమా నియంత్రణ, అభివృద్ధి ప్రాధికార సంస్థ స్పష్టం చేసింది. అయితే ఈ సాంకేతికతకు స్థానిక పరిస్థితులకు అనుగుణంగా శిక్షణ ఇవ్వడంతోపాటు కీలక నిర్ణయాలపై మనుషుల నియంత్రణ ఉండేలా చూడాలని ఐఆర్‌డీఏఐ చైర్మన్ అజయ్ సేథ్ ఇన్సూరర్లకు సూచించారు. సెబీ మాజీ చైర్మన్ ఎం డామోదరన్ నిర్వహించిన గేట్‌కీపర్స్ ఆఫ్ గవర్నెన్స్ 2026 కార్యక్రమంలో సేథ్ మాట్లాడారు. బ్యాంకులు బీమా ఉత్పత్తులను విక్రయించడం, ఆటోమొబైల్ డీలర్లు బీమా పంపిణీతోపాటు వాహనాల మరమ్మతు సేవలను అందించడం వల్ల ప్రయోజనాలు దెబ్బతినే అవకాశం ఉన్నదని చెప్పారు. ఈ క్రమంలోనే బీమా పాలసీల రిస్క్ అంచనా, క్లెయిమ్‌ల పరిష్కారంలో ఏఐ విస్తృత వినియోగంతో వచ్చే ముప్పులను కూడా ప్రస్తావించారు. కాగా, హెల్త్ ఇన్సూరెన్స్ క్లెయిమ్‌లలో పారదర్శకత పెంచేందుకు 10 రోజుల్లో 2 కార్యబృందాలను ఏర్పాటు చేయాలని ఐఆర్‌డీఏఐ యోచిస్తున్నట్టు సేథ్ తెలిపారు.

ఎన్టీపీసీకి సింగరేణి బొగ్గు



హైదరాబాద్, నవంబర్ 20 (నమస్తే తెలంగాణ): ఒడిశాలోని ఎన్టీపీసీ సంస్థకు గల కనిహా థర్మల్‌ప్లాంట్‌కు సింగరేణి సంస్థ బొగ్గును అందించనున్నది. నైనీ కోల్‌బ్లాక్ నుంచి బొగ్గు సరఫరాకు సంస్థ సంసిద్ధత వ్యక్తంచేసింది. ఎన్టీపీసీ సీఎండీ గురుదీప్‌సింగ్‌తో సింగరేణి సీఎండీ డాక్టర్ బుద్ధప్రకాశ్ జ్యోతి శుక్రవారం ఢిల్లీలో భేటీ అయ్యారు. నైనీ బొగ్గు బ్లాక్‌లో బొగ్గు ఉత్పత్తిపై బుద్ధప్రకాశ్ జ్యోతి వివరించారు. యాదాద్రికి అధిక మొత్తంలో బొగ్గు అందిస్తున్నామని, మిగిలిన బొగ్గును కనిహా ప్లాంట్‌కు సరఫరా చేస్తామని పేర్కొన్నారు. వచ్చే ఏడాది నుంచి 10 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి చేయనున్నామని.. నాలుగు దశాబ్దాలపాటు ఈ బ్లాక్ నుంచి బొగ్గు ఉత్పత్తి జరుగుతుందని తెలిపారు.

బాలయ్యతో ఆత్రేయ.. క్లారిటీ వచ్చినట్లేనా..



నందమూరి బాలకృష్ణ అప్ కమింగ్ ప్రాజెక్టులపై గత కొన్ని రోజులుగా సోషల్ మీడియాలో పెద్ద ఎత్తున చర్చ జరుగుతోంది. ముఖ్యంగా యంగ్ డైరెక్టర్ వివేక్ ఆత్రేయతో బాలయ్య చేయాల్సిన సినిమా ఆగిపోయిందంటూ ప్రచారం సాగింది. బాలకృష్ణ వరుస కమిట్మెంట్లతో బిజీగా ఉండటంతో డేట్స్ సమస్య తలెత్తిందని, దీంతో ఆ క్రేజీ కాంబినేషన్ కు బ్రేక్ పడిందని వార్తలు వచ్చాయి. అయితే ఇప్పుడు ఆ రూమర్లకు దాదాపు ఫుల్ స్టాప్ పడినట్టు కనిపిస్తోంది. బాలకృష్ణ బర్త్ డే సందర్భంగా దర్శకుడు వివేక్ ఆత్రేయ స్వయంగా వెళ్లి ఆయనకు విషెస్ తెలిపారు. ఈ సందర్భంగా దిగిన ఫొటోలను సోషల్ మీడియాలో పంచుకున్నారు. ఆ ఫోటోల్లో మైత్రీ మూవీ మేకర్స్ అధినేతల్లో ఒకరైన రవిశంకర్ యలమంచిలి కూడా కనిపించడం విశేషం. దీంతో బాలయ్య- వివేక్ ఆత్రేయ సినిమా ఆగిపోలేదనే అభిప్రాయం వినిపిస్తోంది. అధికారికంగా ఎలాంటి ప్రకటన రాకపోయినా, ఆ ఫోటో ద్వారా ప్రాజెక్టుపై ఉన్న అనుమానాలపై కొంత క్లారిటీ వచ్చినట్టేనని తెలుస్తోంది. అయితే బాలయ్య- ఆత్రేయ సినిమాకు సంబంధించిన ప్రీ ప్రొడక్షన్ పనులు ఇప్పటికే ప్రారంభమయ్యాయట. మూవీ టీమ్ ఎలాంటి హడావుడి లేకుండా తమ పనులను పూర్తి చేస్తోందని తెలుస్తోంది. భారీ బడ్జెట్ తో తెరకెక్కనున్న ఆ సినిమాను మైత్రీ మూవీ మేకర్స్.. హై టెక్నికల్ వాల్యూస్ తో ఉండేలా ప్లాన్ సిద్ధం చేస్తున్నట్లు సమాచారం. అందులో భాగంగా స్టార్ సినిమాటోగ్రాఫర్ సిద్ధార్థ నూనిని సెలెక్ట్ చేసినట్లు టాక్ వినిపిస్తోంది. గతంలో కెప్టెన్ మిల్లర్ వంటి చిత్రాలకు అద్భుతమైన విజువల్స్ అందించిన ఆయన, బాలయ్యను మాస్ అవతార్ లో చూపించనున్నారని తెలుస్తోంది. అంతేకాదు, సినిమాలో కీలక పాత్ర కోసం కోలీవుడ్ యాక్టర్ రిషికాంత్ ను సెలెక్ట్ చేసినట్లు కూడా వార్తలు వినిపిస్తున్నాయి. కథలో కీలక మలుపు తీసుకొచ్చే పవర్ ఫుల్ పాత్రలో ఆయన కనిపించనున్నారని ప్రచారం జరుగుతోంది. అలాగే బాలయ్య సినిమాలో రెండు విభిన్న షేడ్స్ ఉన్న పాత్రల్లో కనిపించనున్నారని కూడా టాక్ నడుస్తోంది. ఆ విషయాలన్నీ ప్రాజెక్ట్ పై మరింత ఆసక్తిని పెంచుతున్నాయి. ఇక బాలకృష్ణ ప్రస్తుతం గోపీచంద్ మలినేని దర్శకత్వంలో రూపొందుతున్న చీదీఖ 111 మూవీ షూటింగ్ తో బిజీగా ఉన్నారు. ఆ సినిమాపై అభిమానుల్లో భారీ అంచనాలు ఉన్నాయి. ఆ తర్వాత కొరటాల శివ దర్శకత్వంలో మరో ప్రాజెక్ట్ పట్టాలెక్కనుంది. ఆ రెండు సినిమాల పనులు పూర్తయిన అనంతరం వివేక్ దర్శకత్వంలోని చిత్రం సెట్స్ పైకి వెళ్లే అవకాశాలు ఉన్నాయని తెలుస్తోంది. బ్రోచేవారెవరురా, సరిపోదా శనివారం వంటి విభిన్న సినిమాలతో దర్శకుడిగా తనదైన ముద్ర వేసుకున్న వివేక్ ఆత్రేయ.. బాలయ్య మాస్ ఇమేజ్ ను ఎలా డీల్ చేస్తారనే ఆసక్తి అభిమానుల్లో నెలకొంది. ఒకవైపు ఆత్రేయ మార్క్ స్టోరీ, మరోవైపు బాలకృష్ణ ఎనర్జీ కలిస్తే కొత్త తరహా మాస్ ఎంటర్టైనర్ ప్రేక్షకుల ముందుకు వచ్చే అవకాశం ఉంది.

గ్రీన్ అవుట్‌ఫిట్‌లో సంయుక్త మ్యాజిక్... ఫోటోలు వైరల్!









సౌత్ ఇండియన్ క్రేజీ బ్యూటీ సంయుక్త మీనన్ సోషల్ మీడియాలో షేర్ చేసిన ఒక కొత్త ఫోటో ఇప్పుడు నెట్టింట తెగ వైరల్ అవుతోంది. ప్రఖ్యాత 'రా మ్యాంగో' బ్రాండ్‌కు చెందిన వైబ్రెంట్ గ్రీన్ కలర్ డ్రెస్‌లో ఆమె దేవకన్యలా మెరిసిపోతోంది. నడుముపై చేతులు వేసి, సైడ్ ప్రొఫైల్‌తో ఆమె ఇచ్చిన పోజ్ అభిమానుల గుండెల్లో గుబులు రేపుతోంది. "నేను కాల్చేసే వంతెనలే నా దారికి వెలుగునివ్వాలి" అంటూ ఆమె పెట్టిన క్యాప్షన్ ఆమె బోల్డ్ అటిట్యూడ్‌ను చూపిస్తోంది. హాట్ టాపిక్‌గా మారిన లేటెస్ట్ ఫోటోషూట్: సంయుక్త మీనన్ ఫోటోషూట్ ఇప్పుడు టాలీవుడ్‌లో హాట్ టాపిక్‌గా మారింది. ఆమె అందం, కాన్ఫిడెన్స్ ఈ ఫోటోల్లో స్పష్టంగా కనిపిస్తున్నాయి. ప్రముఖ సెలబ్రిటీ మేకప్ ఆర్టిస్ట్ కాజల్ ములాని, హెయిర్ స్టైలిస్ట్ ప్రేమ్, స్టైలిస్ట్ గరిమా గార్గ్ లు సంయుక్తను ఎంతో అద్భుతంగా రెడీ చేశారు. ఫోటోగ్రాఫర్ అభిలాష్ రంగి తన కెమెరా కంటితో సంయుక్త సౌందర్యాన్ని అద్భుతంగా బంధించారు. డ్రెస్ స్పెషాలిటీ ఏంటో తెలుసా?: ఈ ఫోటోషూట్ కోసం సంయుక్త ధరించిన డ్రెస్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ప్రముఖ లగ్జరీ టెక్స్‌టైల్ బ్రాండ్ 'రా మ్యాంగో' డిజైన్ చేసిన రిచ్ సిల్క్ దుస్తులు ఇవి. లోతైన స్వీట్‌హార్ట్ నెక్ లైన్, దానికి కాంబినేషన్‌గా వచ్చిన గోల్డ్ టోన్ జ్యామితీయ ఆరి ఎంబ్రాయిడరీ, టాసెల్స్ వర్క్ ఈ డ్రెస్‌కు మరింత రాయల్ లుక్‌ను తీసుకువచ్చాయి. ఇక ఈ ట్రెడిషనల్ అండ్ మోడ్రన్ లుక్‌లో సంయుక్త చాలా క్లాసీగా కనిపిస్తోంది. ఈ స్పెషల్ లుక్ ఏ ఈవెంట్ కోసమంటే?: ఈ అందమైన గ్రీన్ కలర్ డ్రెస్‌ను సంయుక్త ఊరికే ధరించలేదు. ఆమె నటిస్తున్న సరికొత్త చిత్రం 'స్లమ్‌డాగ్: 33 టెంపుల్ రోడ్'. ఈ సినిమాకు సంబంధించిన టీజర్ లాంచ్ ఈవెంట్ ఇటీవలే ఘనంగా జరిగింది. ఈ వేడుక కోసమే సంయుక్త ఇంత స్పెషల్‌గా రెడీ అయ్యి, అందరి దృష్టిని ఆకర్షించింది. ఈ ఈవెంట్‌లో ఆమె లుక్ సినిమాపై అంచనాలను మరింత పెంచేసింది. ఫుల్ బిజీగా ముద్దుగుమ్మ కెరీర్: ప్రస్తుతం సంయుక్త మీనన్ కెరీర్ సూపర్ స్పీడ్‌తో దూసుకుపోతోంది. మలయాళం, తెలుగు, తమిళం, కన్నడ భాషల్లో వరుస సినిమాలు చేస్తూ బిజీగా ఉందీ బ్యూటీ. ఇటీవల ఆమె నటించిన అన్ని సినిమాలు నారి నారి నడుమ మురారి, బాలకృష్ణ సరసన అఖండ 2 వంటి భారీ హిట్స్ అందుకున్నాయి. సంయుక్త మీనన్ కేవలం గ్లామర్‌తోనే కాదు, తన నటనతోనూ ప్రేక్షకులను కట్టిపడేస్తోంది. కెరీర్ పరంగా ఎంతో బోల్డ్‌గా నిర్ణయాలు తీసుకుంటూ, వరుస ఆఫర్లతో స్టార్ హీరోయిన్‌గా ఎదుగుతోంది. ఈ లేటెస్ట్ గ్రీన్ కలర్ ఫోటోషూట్ ఆమె క్రేజ్‌ను సోషల్ మీడియాలో మరింత పెంచేసిందని చెప్పవచ్చు. సంయుక్త ఇలాగే మరిన్ని వైవిధ్యమైన పాత్రలతో మనల్ని అలరించాలని ఆశిద్దాం.

కొత్త ఇన్నింగ్స్‌కు సిద్ధమైన బాలీవుడ్ స్టార్ హీరోయిన్

ముఖ్యంగా మాతృత్వం తర్వాత ఆమె తిరిగి కెమెరా ముందుకు రావాలని నిర్ణయించుకోవడంతో అభిమానుల్లో ఆసక్తి మరింత పెరిగింది.



బాలీవుడ్ స్టార్ హీరోయిన్ కత్రినా కైఫ్ మరోసారి వార్తల్లో నిలిచారు. గత కొంతకాలంగా సినిమాలకు దూరంగా ఉంటూ వ్యక్తిగత జీవితానికి ప్రాధాన్యత ఇచ్చిన ఈ స్టార్ నటి ఇప్పుడు తన కెరీర్‌లో కొత్త అధ్యాయాన్ని ప్రారంభించేందుకు సిద్ధమవుతున్నట్లు బాలీవుడ్ వర్గాల్లో బలమైన చర్చ జరుగుతోంది. ముఖ్యంగా మాతృత్వం తర్వాత ఆమె తిరిగి కెమెరా ముందుకు రావాలని నిర్ణయించుకోవడంతో అభిమానుల్లో ఆసక్తి మరింత పెరిగింది. ఈసారి కత్రినా కేవలం కమర్షియల్ సినిమాలకే పరిమితం కాకుండా, కొత్త తరహా కథలు, స్ట్రాంగ్ ఫీమేల్ రోల్స్, డిజిటల్ స్ట్రీమింగ్ ప్లాట్‌ఫార్మ్‌ల కోసం రూపొందించే ప్రత్యేక ప్రాజెక్టులపై దృష్టి సారిస్తున్నట్లు సమాచారం. గతంలో వెండితెరపై ఎన్నో బ్లాక్‌బస్టర్ సినిమాలతో ప్రేక్షకులను అలరించిన ఆమె, ఇప్పుడు ఓటీటీ ప్రపంచంలో తనదైన ముద్ర వేయాలని భావిస్తున్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం ఆమె ఒక ప్రతిష్ఠాత్మక ఓటీటీ ప్రాజెక్ట్‌కు సంబంధించిన చర్చల్లో పాల్గొంటున్నారని, ఆ ప్రాజెక్ట్ 2027 సెకండాఫ్ లో ప్రేక్షకుల ముందుకు వచ్చే అవకాశాలు ఉన్నాయని సినీ వర్గాలు చెబుతున్నాయి. ఇటీవల కాలంలో ఓటీటీ రంగం భారతీయ వినోద పరిశ్రమలో కీలక వేదికగా మారిన నేపథ్యంలో, పలువురు స్టార్ నటీనటులు కూడా డిజిటల్ కంటెంట్ వైపు అడుగులు వేస్తున్నారు. ఈ నేపథ్యంలో కత్రినా తీసుకున్న నిర్ణయం కూడా ఆసక్తికరంగా మారింది. కుటుంబ బాధ్యతలతో పాటు అర్థవంతమైన పాత్రలు చేయడానికి ఓటీటీ అనుకూలంగా ఉంటుందని ఆమె భావిస్తున్నట్లు సమాచారం. అంతేకాకుండా, దీర్ఘ నిడివి గల వెబ్ సిరీస్‌లలో పాత్రల అభివృద్ధికి ఎక్కువ అవకాశాలు ఉండటంతో నటిగా తనలోని మరో కోణాన్ని ప్రేక్షకులకు చూపించాలనే ఉద్దేశంతో ఈ మార్గాన్ని ఎంచుకున్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం పరిశీలనలో ఉన్న ప్రాజెక్ట్ సాధారణ వెబ్ సిరీస్ కాదని, భారీ బడ్జెట్‌తో రూపొందించే ప్రతిష్ఠాత్మక సిరీస్‌గా ప్లాన్ చేస్తున్నారని బాలీవుడ్ వర్గాలు పేర్కొంటున్నాయి. కథ మొత్తం కత్రినా పాత్ర చుట్టూనే తిరిగేలా రూపుదిద్దుకుంటోందని, ఆమె కెరీర్‌లో ఇది ఒక కీలక మలుపు కావచ్చని విశ్లేషకులు భావిస్తున్నారు. ఇక ఫ్యాన్స్ విషయానికి వస్తే, కత్రినా కమ్‌బ్యాక్ వార్త సోషల్ మీడియాలో ఇప్పటికే హాట్ టాపిక్‌గా మారింది. 2024లో విడుదలైన మేరీ క్రిస్మస్ తర్వాత ఆమె నుంచి కొత్త ప్రాజెక్ట్‌పై ఎలాంటి అధికారిక ప్రకటన రాకపోవడంతో అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ఇప్పుడు ఓటీటీ రంగంలో ఆమె అరంగేట్రం చేయబోతున్నారనే వార్తలు రావడంతో ఆ ఉత్సాహం మరింత పెరిగింది. అయితే ఈ ప్రాజెక్ట్‌కు సంబంధించిన కథ, డైరెక్టర్, స్ట్రీమింగ్ ప్లాట్‌ఫార్మ్ వంటి కీలక వివరాలు ప్రస్తుతం గోప్యంగానే ఉంచినట్లు సమాచారం. స్క్రిప్ట్ అభివృద్ధి దశలో ఉండటంతో మేకర్స్ పూర్తి స్థాయి రహస్యాన్ని పాటిస్తున్నారని తెలుస్తోంది. ఇదే సమయంలో ఈ ప్రాజెక్ట్‌పై అధికారిక ప్రకటన వచ్చే వరకు వేచి చూడాలని సినీ వర్గాలు సూచిస్తున్నాయి. ఏదేమైనా, ఒకప్పుడు బాలీవుడ్‌లో అగ్రస్థానాన్ని దక్కించుకున్న కత్రినా కైఫ్ ఇప్పుడు కొత్త మాధ్యమం ద్వారా మరోసారి తన స్టార్‌డమ్‌ను నిరూపించుకునేందుకు సిద్ధమవుతుండటం ఇండస్ట్రీలో ఆసక్తికర చర్చకు దారితీస్తోంది. ఓటీటీ ప్రపంచంలో ఆమె కొత్త ప్రయాణం ఎలా ఉండబోతుందో తెలుసుకోవాలని అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

యష్ 'టాక్సిక్'.. ఆ ఒక్క సీన్ మాత్రమే ఎందుకు?

రాకింగ్ స్టార్ యష్ లీడ్ రోల్ లో తెరకెక్కుతున్న భారీ పాన్ ఇండియా మూవీ టాక్సిక్ మరోసారి హాట్ టాపిక్ గా మారింది. కేజీఎఫ్ ఫ్రాంచైజీ తర్వాత యష్ నుంచి వస్తున్న సినిమా కావడంతో ఆ ప్రాజెక్టుపై భారీ అంచనాలు నెలకొన్నాయి. అయితే రీసెంట్ గా విడుదలైన బీటీఎస్ వీడియో చూసిన



తర్వాత అభిమానుల్లో కొత్త డౌట్లు మొదలయ్యాయి. మేకర్స్ ఎందుకు పదేపదే ఒకే యాక్షన్ ఎపిసోడ్ ను మాత్రమే చూపిస్తున్నారన్న ప్రశ్న ఇప్పుడు సోషల్ మీడియాలో వినిపిస్తోంది. దర్శకురాలు గీతూ మోహన్ దాస్ బర్త్ డే సందర్భంగా మూవీ టీమ్ స్పెషల్ బీటీఎస్ వీడియోను రిలీజ్ చేసింది. ఇందులో సెట్స్ లో అమె యాక్షన్ సీన్స్ ను ఎలా డిజైన్ చేస్తున్నారు? యష్ తో కలిసి ఎలా ప్లాన్ చేస్తున్నారు? అనే విషయాలను చూపించారు. ముఖ్యంగా ఓ చర్చ్ నేపథ్యంలో సాగే స్టైలిష్ ఫైట్ సీక్వెన్స్ చుట్టూనే వీడియో మొత్తం తిరగడం గమనార్హం. ఇక్కడే అభిమానుల్లో ఆసక్తితో పాటు అనుమానాలు కూడా మొదలయ్యాయి. ఇప్పటివరకు విడుదలైన గ్లింప్స్ అయినా, తాజాగా వచ్చిన బీటీఎస్ వీడియో అయినా దాదాపు అదే చర్చ్ ఫైట్ ఎపిసోడ్ చుట్టూనే తిరుగుతున్నాయి. సినిమాలోని మిగతా రోల్స్, ఎమోషనల్ సీన్స్ తోపాటు కథకు సంబంధించిన కీలక విషయాలు మాత్రం సీక్రెట్ గానే ఉంచుతున్నారు టాక్సిక్ మేకర్స్. దీంతో టాక్సిక్ లో అసలు దాచిపెడుతున్నది ఏమిటి? అనే చర్చ మొదలైంది. మేకర్స్ బయటపెట్టకుండా జాగ్రత్త పడుతున్నారా? అనే ప్రశ్నలు వినిపిస్తున్నాయి. అయితే పాన్ ఇండియా స్థాయిలో తెరకెక్కుతున్న సినిమాలకు ఇప్పుడు ప్రమోషన్ స్ట్రాటజీ కీలకంగా మారింది. ఒకే యాక్షన్ ఎపిసోడ్ ను పదేపదే చూపించడం ద్వారా ఆడియన్స్ లో క్యూరియాసిటీ పెంచాలని మేకర్స్ భావించి ఉండొచ్చు. ముఖ్యంగా యష్ ను పూర్తిగా కొత్త స్టైలిష్ అవతార్ లో చూపించే సీన్ అదే అయితే, దానినే హైలైట్ చేస్తూ మార్కెటింగ్ చేయడం వెనుక ప్లాన్ ఉండొచ్చని అంటున్నారు. మరోవైపు సినిమా విడుదల తేదీపై కూడా ఇంకా క్లారిటీ లేదు. ఇప్పటికే విడుదల కావాల్సిన ఆ సినిమా సరైన సమయం కోసం వేచి చూస్తోందనే ప్రచారం జరుగుతోంది. పండుగల సీజన్ ను టార్గెట్ చేసుకుని అక్టోబర్ లో విడుదల చేసే అవకాశాలు ఉన్నాయని ఇప్పుడు గట్టిగా వినిపిస్తోంది. అయితే దీనిపై మూవీ టీమ్ నుంచి అఫీషియల్ అనౌన్స్మెంట్ రావాల్సి ఉంది. కేవీఎన్ ప్రొడక్షన్స్ నిర్మిస్తున్న మూవీలో యష్ సరసన నయనతార, కియారా అద్వానీ కీలక పాత్రల్లో నటిస్తున్నారు. హ్యూమా ఖురేషి, తారా సుతారియా, అక్షయ్ ఒబెరాయ్ తదితరులు కూడా ముఖ్య పాత్రలు పోషిస్తున్నారు. రవి బస్రూర్ మ్యూజిక్ అందిస్తుండటం మరో ప్రత్యేక ఆకర్షణగా మారింది. ఏదేమైనా టాక్సిక్ గురించి ఇప్పటివరకు బయటకు వచ్చిన ప్రతి అప్డేట్ ను చూసుకుంటే.. మేకర్స్ తమ దగ్గర ఇంకా చాలా సర్ప్రైజ్ లు ఉన్నాయన్న సిగ్నల్స్ ఇస్తూనే, ప్రేక్షకుల్లో ఇంట్రెస్ట్ పెంచుతున్నారని చెప్పాలి. అయితే ఆ చర్చ్ ఫైట్ సీక్వెన్స్ వెనుక దాగి ఉన్న అసలు కథ ఏమిటో తెలుసుకోవాలంటే టీజర్/ ట్రైలర్ లేదా సినిమా విడుదల వరకు వేచి చూడాల్సిందే.

This newspaper is Owned and Published by KANTIPUDI RAVENDRA from **H. NO. 319, 2ND FLOOR, BHAGATHSINGH NAGAR, PHASE 1, SARDAR PATEL NAGAR, NEAR SRADHA SCHOOL, VENKATESWARA SWAMY TEMPLE kPHB, KUKATPALLY, MEDCHAL MALKAJGIRI, TELANGANA- 500072.** Edtor: KANTIPUDI RAVENDRA, Printed by BANDLA SAIBABU from PLOT NO. A-221, ROAD NO.14, INDUSTRIAL PARK, NACHARAM, HYDERABAD, MEDCHAL MALKAJGIRI, TELANGANA- 500076. PRGI REGD NO.: TGTEL26/A4986. Phone: 9392666319. Email ID: prabhathakiranam@gmail.comCorporate Office: HIG 79, VNR RESIDANCY, VENKATARAMANA COLONY, KUKATPALLY, HYDERABAD, 500085